తెలంగాణ

తెలుగు జాతీయ దినపత్రిక

# తెలుగు-వెలుగు

ప్రతిక్షణం ప్రజల పక్షం

సంపుటి : 02 సంచిక 335 హైదరాబాద్ : సంపాదకులు : గున్నాల అనిల్‌రెడ్డి గురువారం 22-5-2025 పేజీలు : 12 వేల : 5

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur




# మావోయిస్టు చీఫ్ ఎన్‌కౌంటర్

## అబూజ్‌మఢ్‌లో నేలకొరిగిన నంబాల కేశవరావు

**మరో 26 మంది నక్సల్స్ కూడా.. ఎన్‌కౌంటర్‌లో ప్రధాన కార్యదర్శి మృతి ఇదే తొలిసారి**

**అబూజ్‌మఢ్‌లో 72 గంటలపాటు ఆపరేషన్**

**గణపతి తర్వాత మావోయిస్టు పార్టీ చీఫ్ పదవి**

**ఏడేళ్లుగా ఉద్యమానికి కేశవరావు సారథ్యం**



**చర్ల/హనుమకొండమే 21:** 'ఆపరేషన్ కగార్'తో అతలాకుతలమవుతున్న మావోయిస్టు పార్టీకి మరో గట్టి దెబ్బ తగిలింది..! ఇప్పటికే అగ్రనాయకులను పోగొట్టుకుని, క్యాడర్ లొంగుబాట్లతో సతమతమవుతున్న మావోయిస్టు పార్టీ బుధవారం పెద్ద దిక్కును కోల్పోయింది. పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు(71) ఛత్తీస్‌గఢ్ లోని అబూజ్‌మఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జీయన్న పేటకు చెందిన కేశవరావు వరంగల్ ఆర్ఈసీలో ఇంజనీరింగ్ పూర్తిచేశాక.. అజ్ఞాతంలోకి వెళ్లారు. నక్సలిజంపై పోలీసులు జరుపుతున్న ఐదు దశాబ్దాల పోరులో.. ప్రధాన కార్యదర్శి స్థాయి నేత మృతి చెందడం ఇదే తొలిసారి. బుధవారం నాటి ఎన్‌కౌంటర్‌లో మరో 26 మంది నక్సల్స్ చనిపోగా, వారిలో పలువురు అగ్రనాయకులు, కేశవరావు అంగరక్షకులున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. మావోయిస్టు పార్టీ పత్రిక అవామ్-ఇ-జంగ్ చీఫ్ ఎడిటర్ సజ్జా వెంకట నాగేశ్వర్‌రావు కూడా మృతిచెందినట్లు ప్రచారం జరుగుతున్నా.. పోలీసులు నిర్ధారించలేదు.

మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఓ డీఆర్‌జీ జవాను మృతిచెందగా.. మరో ఐదుగురు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్ పోలీసుల కథనం ప్రకారం.. మూడంచెల భద్రత ఉండే మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు.. పార్టీ అగ్రనాయకులు, కేంద్ర కమిటీ సభ్యులు, డీవీసీఎం నేతలు అబూజ్‌మఢ్ అడవుల్లో సమావేశమైనట్లు ఈ నెల 19న ఇంటెలిజెన్స్ వర్గాలు ఛత్తీస్‌గఢ్ పోలీసులకు ఉప్పందించాయి. దాంతో అదే రోజు తెల్లవారుజామున నారాయణపూర్, బీజాపూర్, దంతేవాడ, కొండగావ్ జిల్లాలకు చెందిన డీఆర్జీ బలగాలు, స్థానిక పోలీసులు కూంబింగ్ చేపట్టారు. "72 గంటల పాటు ఆపరేషన్ కొనసాగింది.

ఈ క్రమంలో బుధవారం ఉదయం బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. మావాళ్లు ఎదురు కాల్పులు జరిపారు. మూడు గంటలపాటు ఇరువైపులా కాల్పులు కొనసాగాయి. మావోయిస్టుల వైపు కాల్పులు నిలిచిపోయిన తర్వాత.. బలగాలు గాలింపును కొనసాగించాయి. 27 మంది మావోయిస్టుల మృతదేహాలు, ఏకే-47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, కార్బైన్ తుపాకులు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాం" అని నారాయణపూర్ పోలీసులు మీడియాకు తెలిపారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు అలియాస్ బీఆర్ దాదా అలియాస్ గంగన్నను గుర్తించామన్నారు. ఈయనకు మరో 10 పేర్లున్నట్లు తెలిపారు. మిగతా వారిలో కేశవరావు అంగరక్షకులు, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ, పీఎల్‌జీఏ నేతలు, సభ్యులు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందన్నారు. కేశవరావుపై ఛత్తీస్‌గఢ్ పోలీసులు రూ.కోటిన్నర రివార్డు ప్రకటించగా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రల్లో కూడా రివార్డులున్నట్లు వెల్లడించారు. కాగా.. మృతిచెందిన మిగతా మావోయిస్టుల వివరాలు గురువారానికి తెలిసే అవకాశాలున్నాయి.

# ట్రంప్ ఒత్తిడికి లొంగిన కేంద్రం

**తప్పు కప్పిపుచ్చుకునేందుకే రాహుల్‌పై విమర్శలు..**

**దేశానికి వన్నె తెచ్చిన నేత రాజీవ్‌గాంధీ**

**రాజీవ్ వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, మే 21:** పాకిస్థాన్‌తో యుద్ధం విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి ప్రధాని మోదీ సర్కారు లొంగిపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్ కాలు దువ్వితే శాశ్వత గుణపాఠం చెప్పాలంటూ కాంగ్రెస్ పార్టీ సహా అందరూ అండగా నిలబడ్డా.. వెనకడుగు వేసిన దుస్థితి మోదీ సర్కారుదని అన్నారు. కానీ, 1971లో పాక్‌తో యుద్ధం జరిగినప్పుడు.. అమెరికా అధ్యక్షుడు మధ్యవర్తిత్వం వహిస్తానన్నా నాటి ప్రధాని ఇందిరాగాంధీ తిరస్కరించారని తెలిపారు. "మాపై పెత్తనం చెలాయించాలనుకుంటే మా దేశం సహించబోదని, ఎవరి మధ్యవర్తిత్వమూ మాకు అవసరం లేదని మా దేశాన్ని మేమే రక్షించుకోగలమని విస్పష్టంగా చెప్పిన ఘనత ఇందిరాగాంధీది" అని రేవంత్ అన్నారు. బుధవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి.. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. భారతదేశంపై పెత్తనం చెలాయించాలని 1971లో పాకిస్థాన్ యుద్ధం చేస్తే.. ఆ దేశాన్నే చీల్చి.. ఆ దేశ ప్రభుత్వ పెద్దలకు గుణపాఠం చెప్పిన ఘనత ఉక్కు మహిళ ఇందిరాగాంధీది అని కొనియాడారు. ఉగ్రవాదం ముసుగులో దేశ పౌరులపై దాడులను నిర్మూలించడంలో ఇందిరాగాంధీయే మనకు ఆదర్శమన్నారు. పహల్గాం ఘటన తర్వాత మోదీ సర్కారుకు ఖర్గే, రాహుల్‌సహా కాంగ్రెస్ శ్రేణులూ అండగా నిలబడ్డాయని తెలిపారు. అయినా దానిని సద్వినియోగం చేసుకోకుండా దురదృష్టవశాత్తూ కేంద్రం వెనుకడుగు వేసిందన్నారు. పాకిస్థాన్‌తో యుద్ధాన్ని ఆపకుంటే ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తానని తాను బెదిరిస్తే.. భారత ప్రభుత్వం తన ఒత్తిడికి లొంగిందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించే పరిస్థితి వచ్చిందని రేవంత్ అన్నారు.

# రాహుల్ సోనియాకు 142 కోట్ల లబ్ధి

**నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్‌లో వారికి అనుచిత ప్రయోజనం**

**ప్రజల విరాళాలను ప్రైవేటు ఆస్తిగా మార్చేందుకే 'యంగ్ ఇండియా'**

**అది మోసపూరిత సంస్థ .. ఢిల్లీ కోర్టులో ఈడీ**



**న్యూఢిల్లీ, మే 21:** నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీలాండరింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ రూ.142 కోట్ల అనుచిత ప్రయోజనం పొందారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది. కాంగ్రెసకు పార్టీకి ప్రజలిచ్చిన విరాళాలను ప్రైవేటు ఆస్తులుగా మలచుకునేందుకే 'యంగ్ ఇండియా' కంపెనీని ఏర్పాటు చేశారని.. నిజానికి అదో మోసపూరిత కంపెనీ అని పేర్కొంది. బుధవారం ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే ఎదుట ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు వాదనలు వినిపించారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురించే అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్), దానికున్న రూ.2 వేల కోట్ల ఆస్తులపై నియంత్రణ కోసం 2010లో యంగ్ ఇండియన్ కంపెనీని ఏర్పాటు చేశారని తెలిపారు. 2023 నవంబరులో దాని ఆస్తులు జప్తు చేశామని.. అప్పటివరకు.. అంటే 13 ఏళ్లపాటు ఆయా ఆస్తులను అనుభవించారని.. అద్దెల కింద రూ.142 కోట్ల ఆదాయం అక్రమంగా పొందారని పేర్కొన్నారు. కేసు డాక్యుమెంట్లు 5 వేల పేజీలు ఉన్నాయని.. తమ స్పందన తెలియజేసేందుకు సమయమివ్వాలని రాహుల్, సోనియా తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోరారు. దీంతో కోర్టు విచారణను జూలైకి వాయిదావేసింది. జూలై 2 నుంచి 8 వరకు రోజువారీ విచారణ జరుపుతామని వెల్లడించింది. నేషనల్ హెరాల్డ్/ఏజేఎల్ ఆస్తులకు సంబంధించి బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యంస్వామి ప్రైవేటు ఫిర్యాదు చేశారు. ఢిల్లీ కోర్టు 2014లో దానిని పరిగణనలోకి తీసుకుంది. దాని ఆధారంగా 2021లో ఈడీ కేసు నమోదుచేసింది. సోనియా, రాహుల్, శామ్ పిట్రోడా, సుమన్ దూబే, యంగ్ ఇండియన్, ఇంకో రెండు అనుబంధ సంస్థలను నిందితులుగా చేర్చింది. గత నెల 9న చార్జిషీటు కూడా దాఖలు చేసింది. ఏజేఎల్ స్వాధీనంలో కాంగ్రెస్ అధ్యక్షురాలిగా తన పదవిని సోనియాదుర్వినియోగం చేశారని ఈడీ వర్గాలు తెలిపాయి. 'యంగ్ ఇండియన్, ఏజేఎల్ పరిపాలన, ఆర్థిక వ్యవహారాల అధికారాన్ని మోతీలాల్ వోరాకు అప్పగించామని.. అన్నీ ఆయనే చూసుకున్నారని సోనియా, రాహుల్ విచారణలో చెప్పారు. సోనియా అధికార దుర్వినియోగానికి పాల్పడగా.. రాహుల్ ఏజేఎల్ వాటాదారులను, ఏఐసీసీ దాతలను మోసగించారు. రూ.988 కోట్ల అక్రమంలోఆయన క్రియాశీల పాత్ర పోషించారు' అని వెల్లడించాయి.

# మరో 4 రోజులు వానలు

## నేడు 8 జిల్లాలకు ఎల్లో అలర్ట్

**- అరేబియా సముద్రంలో అల్పపీడనం - వాయుగుండంగా మారే అవకాశం**

**- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి**

**- వర్షాలపై ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్**



**హైదరాబాద్, మే 21:** రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వానలు పడుతున్నాయి. బుధవారం పలుచోట్ల ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు నమోదయ్యాయి. కొన్ని పట్టణాల్లో కాలనీలు నీట మునిగాయి. రోడ్లు జలమయం అయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. ఈదురుగాలుల ధాటికి చెట్లు కూలిపడ్డాయి. ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. మరోవైపు అరేబియా సముద్రంలో గురువారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, అది ఉత్తర దిక్కులో కదులుతూ క్రమేపీ బలపడి వాయుగుండంగా మారుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో మరో నాలుగు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వానలు పడతాయని వెల్లడించింది. గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గంటకు 40-50 కి.మీ.వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. మిగతా అన్ని జిల్లాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడతాయని వెల్లడించింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు రాష్ట్రంలోని 612 మండలాలకుగాను 306 మండలాల్లో వర్షం కురిసినట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో 8.6, నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో 7.6, కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో 7.2, బాన్సువాడలో 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరోవైపు బుధవారం కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత కనిపించింది. నల్గొండ జిల్లా దేవరకొండలో అత్యధికంగా 43.6, నిర్మల్ జిల్లా పెంబిలో 41.1, ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టీలో 40.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణం అనుకూలంగా ఉండటంతో.. నైరుతి రుతుపవనాలు వేగంగా పురోగమిస్తున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా బుధవారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అనుముల మండలంలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. నార్కట్‌పల్లిలో గాలివాన ధాటికి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూలిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కోదాడ, హుజూర్‌నగర్‌లోని పలు ఇళ్లలో విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. లోతట్టు కాలనీలు, రహదారులు జలమయం అయ్యాయి. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి ఆ కాలనీలను సందర్శించారు. ములుగు జిల్లాలోని తాడ్వాయి, ఏటూరు నాగారం, వెంకటాపురం మండలాల్లో భారీ వర్షం పడింది. గాలి దుమారానికి మేడారం- తాడ్వాయి రోడ్డులో చెట్టు విరిగిపడింది. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలో భారీ వర్షంతో ప్యాలవరం వాగు పొంగిపొర్లింది. నారాయణఖేడ్ మండలంలో ఈదురుగాలి దాటికి పలు ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని పలు ఇళ్ల పైకప్పులు కూలిపడ్డాయి. నిజామాబాద్ జిల్లా నవీపేట, మోపాల్ మండలాల్లో చెట్లు విరిగిపడ్డాయి. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో బొబ్బిలి వాగు ఉప్పొంగింది.

# కీలక దశకు మిస్‌వరల్డ్ పోటీలు

**టాప్ 24ను ప్రకటించిన నిర్వాహకులు.. జాబితాలో మిస్ ఇండియా నందినీ గుప్తా**

**రేపు ఖరారు కానున్న టాప్-10 జాబితా.. అందరి దృష్టి నందిని పైనే**

**హైదరాబాద్, మే 21:** తెలంగాణ ఆతిథ్యమిస్తున్న మిస్ వరల్డ్-2025 పోటీలు రసవత్తరంగా మారుతున్నాయి. పోటీలో పాల్గొంటున్న మొత్తం 108 దేశాల సుందరీమణుల నుంచి టాప్-24 జాబితాను మిస్‌వరల్డ్ నిర్వాహక సంస్థ బుధవారం ప్రకటించింది. ఇందులో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నందినీ గుప్తా సహా.. నాలుగు ఖండాల నుంచి 24 మంది అందగత్తెలు ఉన్నారు. వీరిలో యూరప్‌లోని పోలండ్, మాల్టా, ఇటలీ, ఎస్తోనియా, జర్మనీ, నెదర్లాండ్స్, వేల్స్, చెక్ రిపబ్లిక్, ఐర్లాండ్ దేశాలకు చెందిన 9 మంది ఉన్నారు. ఇక అమెరికా-కరేబియన్ ఖండం నుంచి అమెరికా, బ్రెజిల్, జమైకా, అర్జెంటినా, కేమెన్ ఐలాండ్స్, ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన ఆరుగురు ఎంపికయ్యారు.

కాగా, ఆసియా-ఓసియానా ఖండం నుంచి భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్ దేశాలకు చెందినవారు. ఆఫ్రికా నుంచి నైజీరియా, ఇథియోపియా, కామెరూన్, కెన్యా దేశాల సుందరీమణులు ఉన్నారు. కాగా మిస్‌వరల్డ్ పోటీదారులు 'బ్యూటీ విత్ పర్పస్' పేరుతో తమ సేవా కార్యక్రమాలను వివరించే 'హెడ్ 2 హెడ్' పోటీలు మంగళవారం ప్రారంభమై.. బుధవారం ముగిశాయి. రెండు రోజుల్లో మొత్తం 108 మంది ఈ పోటీలో పాల్గొన్న అనంతరం టాప్-24 జాబితాను ప్రకటించారు. ఈ నెల 10న ప్రారంభమైనప్పటి నుంచి బుధవారం వరకు వివిధ దశల్లో పోటీలు నిర్వహించినట్లు మిస్ వరల్డ్ నిర్వాహకులు తెలిపారు.



# కేసీఆర్ కు నోటీసులు కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట

## బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



హైదరాబాద్,మే21: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి మండిపడ్డారు. విశ్వఖ్యాతి గాంచిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో కేసీఆర్ కు వచ్చిన పేరుప్రతిష్టలు చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం విషం కక్కుతోందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. నయాపైసా దుర్వినియోగం జరగకపోయినా ఏదో అవినీతి జరిగినట్లు అబద్ధాలు ప్రచారం చేసి ప్రజలను పక్కదారి పట్టించిన కాంగ్రెస్ జిత్తులమారి రాజకీయం చూసి గోబెల్స్ కూడా సిగ్గు పడతాడని ఆయన ఎద్దేవా చేశారు. అసలు ఏం నేరం చేశారని కేసీఆర్ ను వేధిస్తున్నారు?. ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ సాధించినందుకా?. 14 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో కాంగ్రెస్, బీజేపీ లను గడగడలాడించి మెడలు వంచినందుకా? తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల కలను సాకారం చేసేందుకు ఆమరణ దీక్ష చేపట్టి చావు నోట్లో తలపెట్టి పోరాడినందుకా?. పదేళ్ల ముందు చూపు పాలనతో తెలంగాణ వరప్రదాయని 'కాళేశ్వరం' కట్టికోటి ఎకరాలకు సాగు నీరిచ్చి తెలంగాణను సస్యశ్యామలం చేసినందుకా?. రైతుబంధు, బీమా, ఉచిత విద్యుత్ తో రైతును రాజును చేసినందుకా?. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచి నీరిచ్చి నందుకా? అని జీవన్ రెడ్డి నిలదీశారు. కళ్యాణ లక్ష్మి స్కీమ్ ద్వారా పేదింటి ఆడపిల్లల పెండ్లిండ్లు చేయడం, రూ.200 ఫించన్ రూ.3వేలకు పెంచడం,వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడం, సెక్రటేరియట్ అద్భుతంగా కట్టడం కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిలో కేసీఆర్ చేసిన నేరాలా? అని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగులకు రూ.73 శాతం ఫిట్మెంట్,తెలంగాణ ఇంక్రిమెంట్ ,ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు, మగబిడ్డ పుడితే రూ.12 వేలు ఇచ్చే కేసీఆర్ కిట్, మిషన్ కాకతీయ కింద 48 వేలకు పైగా చెరువుల పునరుద్ధరణ, వేలాది చెక్ డ్యామ్ ల నిర్మాణం, బతుకమ్మ చీరల పంపిణీ, క్రిస్మస్ కానుక, రంజాన్ తోఫా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల , సీతారామ ప్రాజెక్టు నిర్మాణాలు, రూ.2 వేల కోట్లతో యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు చేస్తున్న కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్మాణం వంటివి కేసీఆర్ చేసిన క్షమించరాని నేరాలా?అని జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఉద్యమంలో అయినా, పాలనలో అయినా, ప్రపంచాన్నే వణికించిన కరోనా విపత్తులో అయినా ప్రజలకు ధైర్యమే ఇచ్చిన ధీశాలి కేసీఆర్ ఏనాడూ పిరికిమాటలు మాట్లాడలేదని ఆయన తెలిపారు.అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను ఏమార్చి 1.5 శాతం ఓట్లతో అడ్డి మార్ గుడ్డి దెబ్బల అధికారం దక్కించుకుని తంతే గారెల బుట్టల పడ్డోడు ఇప్పటి ముఖ్యమంత్రి అని ఆయన మండిపడ్డారు. ఏడాదిన్నర తిరగక ముందే పాలన చేతకాక చేతులు ఎత్తేసి లేకి కూతలు కూస్తూ తెలంగాణ పరువును బజారున పడేస్తున్న కాంగ్రెస్ రాష్ట్రానికి అరిష్టమన్నారు. కేసీఆర్ గారి పదేళ్ల పాలనలో పెట్టుడు తప్ప తిట్టుడు లేదని, సంపద పెంచి పేదలకు పంచడం ఒక్కటే కేసీఆర్ కు తెలుసని ఆయన స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలు సమానంగా చూడాలని ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు అందించి ప్రతీ కంట్లో సంతోషం చూసినందుకు కేసీఆర్ కు ఇస్తున్న బహుమానం ఈ నోటీసులా?అని ఆయన దుయ్యబట్టారు.ఏం పాపం చేశారని కేసీఆర్ వెంటబడ్డారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.కేవలం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయలేక చేతులెత్తేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్ కు నోటీసుల పేరుతో డైవర్షన్ పోలిటిక్స్ చేస్తోందని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ కు నోటీసులు తెలంగాణ ఆత్మగౌరవానికి గొడ్డలిపెట్టుగా ఆయన అభివర్ణించారు. విచారణల పేరుతో వేధిస్తే తెలంగాణ ప్రజలు సహించరని ఆయన హెచ్చరించారు. రేవంత్ రెడ్డి సర్కార్ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ తో గోక్కున్నోళ్లెవరు బాగుపడలేదని, కేసీఆర్ జోలికొచ్చినందుకు కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించక తప్పదని జీవన్ రెడ్డి హెచ్చరించారు.

# తిరుమల భద్రతకు "యాంటీ డ్రోన్" అస్త్రం

- **టీటీడీ బోర్డు కీలక తీర్మానాలు**
- **తిరుమల భద్రతకు ఇజ్రాయెల్ యాంటీ డ్రోన్ టెక్నాలజీ!**
- **సీఎం ఆదేశాలతో తిరుమల కొండలపై 80 శాతానికి పచ్చదనం పెంపు**
- **స్విమ్స్‌కు అదనంగా రూ.71 కోట్ల ఆర్థిక సాయం, వైద్య సిబ్బంది నియామకం**
- **టీటీడీలో అన్యమతస్థులకు వీఆర్ఎస్ లేదా బదిలీకి చర్యలు**
- **గోవింద నామావళి రీమిక్స్‌పై 'డీడీ నెక్స్ట్ లెవల్' చిత్రబృందంపై చట్టపరమైన చర్యలు**
- **తిరుచానూరు, ఒంటిమిట్ట సహా పలు ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్**



తిరుమల శ్రీవారి ఆలయ భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మకర్తల మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఆలయ పరిసరాల్లో డ్రోన్లు పనిచేయకుండా నిరోధించే అత్యాధునిక "యాంటీ డ్రోన్ టెక్నాలజీ"ని వినియోగించాలని తీర్మానించింది. మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో పలు ముఖ్యమైన అంశాలపై చర్చించి, ఆమోదముద్ర వేశారు. సమావేశానంతరం ఈవో జె. శ్యామలరావు మీడియాకు వివరాలు వెల్లడించారు.తిరుమల ఆలయ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, డ్రోన్ల ద్వారా ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు ఇజ్రాయెల్‌కు చెందిన యాంటీ డ్రోన్ సాంకేతికతతో పాటు మరికొన్నింటిని పరిశీలించి, అత్యుత్తమమైన దానిని ఎంపిక చేయాలని బోర్డు నిర్ణయించినట్లు ఈవో శ్యామలరావు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తిరుమల కొండలపై ప్రస్తుతం ఉన్న 68.14 శాతం పచ్చదనాన్ని అటవీశాఖ ద్వారా 80 శాతానికి పెంచేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకు ప్రభుత్వ అనుమతి లభించిన వెంటనే దశలవారీగా రూ.4 కోట్లు విడుదల చేయనున్నారు. అలాగే, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి, నారాయణవనం, కపిలతీర్థం, నాగాలాపురం, ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయాల అభివృద్ధి కోసం సమగ్ర బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) రూపొందించేందుకు ఆర్కిటెక్ట్‌ల నుంచి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయించారు. తుళ్లూరు మండలం అనంతవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు.రాయలసీమ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రస్తుతం ఇస్తున్న రూ.60 కోట్లకు అదనంగా మరో రూ.71 కోట్లు ఆర్థిక సహాయం అందించాలని బోర్డు నిర్ణయించింది. స్విమ్స్‌లో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయడంతో పాటు, నిర్మాణంలో ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. శ్రీవారి సేవ తరహాలోనే "శ్రీవారి వైద్య సేవ"ను కూడా త్వరలో ప్రారంభించనున్నారు. తిరుమలలోని బిగ్ క్యాంటీన్లు, జనతా క్యాంటీన్ల లైసెన్సు ఫీజును నిర్ణయించే అంశానికి ఆమోదం తెలుపుతూ, భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు పేరొందిన సంస్థలకు వీటిని అప్పగించాలని నిర్ణయించారు. ప్రస్తుతం క్యాంటీన్లు నిర్వహిస్తున్న సంస్థల హోటళ్లను ఓ ప్రత్యేక బృందం పరిశీలించి, వారి సేవలు సంతృప్తికరంగా ఉంటేనే అనుమతులు కొనసాగించనున్నారు. ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌలిక సదుపాయాలను మరింత పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని తీర్మానించారు. ఒంటిమిట్టలో భక్తులకు అన్నదానం సేవలను మరింత విస్తృతం చేయనున్నారు.తిరుమలలోని విశ్రాంతి గృహాల పేర్ల మార్పు విషయంలో స్పందించని దాతలకు చెందిన రెండు వసతి గృహాల పేర్లను టీటీడీనే మార్పు చేయాలని నిర్ణయించారు. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్ నివాస్ పేరు మార్పుపై వారితో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. టీటీడీలో పనిచేస్తున్న అన్యమతస్థులను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బదిలీ చేయడం లేదా స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) పథకం వర్తింపజేయడం వంటి చర్యలు చేపట్టేందుకు ఆమోదం తెలిపారు.ఇటీవల శ్రీవారి గోవింద నామావళిని రీమిక్స్ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన 'డీడీ నెక్స్ట్ లెవల్' చిత్రబృందంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ధర్మకర్తల మండలి నిర్ణయించింది. ఈ మేరకు టీటీడీ అధికారులు తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

# హనుమాన్ శోభ యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొందాం

**శోభ యాత్రను ను విజయవంతం చేద్దాము**

**నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి కి ఆహ్వానం అందించిన బజరంగ్ దళ్ నేతలు**



విశ్వ హిందూ పరిషత్ - బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శ్రీ వీర హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా శోభ యాత్ర ఆహ్వానము నెల్లి శ్రీవర్ధన్ రెడ్డికి అందించారు.ఈ సందర్భముగా బైక్ స్టిక్కర్ వాల్ స్టిక్కర్ ను వారికి అందించారు. ఈ సందర్భముగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ హనుమాన్ శోభయాత్ర " షాద్ నగర్ పట్టణంలో ఈనెల 22న గురువారం, సమయం సా"04:00గం"లకు కన్యక పరమేశ్వరి దేవాలయం నుండి పెద్ద జానంపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వరకు నిర్వహించడం జరుగుతుంది. కావున హిందూ బంధువులు అందరూ అధిక సంఖ్యలో తరలి వచ్చి హిందూ ఐక్యతను చాటగలరని కోరారు.ఈ కార్యక్రమములో జిల్లా సురక్ష ప్రముఖ్ ప్యాట వంశీ ప్రఖండ సంయోజక్ రోళ్ళ గిరి వి హెచ్ పి హన్మంత్ రెడ్డి పట్టణ సంయోజక్ వినయ్ కుమార్ పట్టణ కార్యదర్శి వాద్యాల హృషీకేశ్ పట్టణ కోశాధికారి దిలీప్ రెడ్డి హిందూవాహిని పట్టణ అధ్యక్షులు రాఘవేందర్ కో కన్వీనర్ ఉడుత అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నోటీసులు వస్తే.. స్పందిస్తా



కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై మాజీ సీఎం కేసీఆర్తో పాటు హరీష్ రావు, ఈటల రాజేందర్కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నుంచి నోటీసులు అందినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై మీడియా ఈటలను ప్రశ్నించగా.. తనకు ఎలాంటి నోటీసులు రాలేదని, నోటీసులు వస్తే.. ఆ అంశంపై స్పందిస్తాన న్నారు. తనకు నోటీసులు అందాక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, తన అభిప్రాయాలను చెబుతా నన్నారు. నోటీసులను చూడకుండా ఏమీ మాట్లాడలేనని స్పష్టం చేశారు.

## మనుషుల్ని చంపి మొసళ్లకు ఆహారంగా...



కరడుగట్టిన సీరియల్ కిల్లర్ దేవేందర్ శర్మ(67)ను ఢిల్లీ పోలీసులు పట్టుకు న్నారు. అతడు ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల్లో 50కు పైగా హత్యలు చేశాడు. మనుషుల్ని కిరాతకంగా చంపేసి, యూపీలోని కాస్గంజ్లో మొసళ్లు ఎక్కువగా ఉండే హజారా కాల్వలో పడేసేవాడన్నారు. కోర్టులు అతడికి జీవిత ఖైదు, మరణ శిక్ష విధించాయి. కానీ పరారీలో ఉన్నాడు. రాజస్థాన్లోని దౌసాలోని ఓ ఆశ్రమంలో మారువేషంలో ఉండగా తాజాగా పోలీసులు అరెస్టు చేశారు.

## బిగ్ బాస్ నారాయణ.. మిస్ వరల్డ్ నారాయణ !



సీపీఐ అగ్రనేత, కమ్యూనిస్టు ప్రముఖుడు సీపీఐ నారాయణలో ఏ మూలో బీజేపీ భావజాలం ఉన్నట్లుగా ఎవరికైనా అనిపిస్తే అందులో వింతేం ఉండదు. ఎందుకంటే ఆయన బూర్జువా విధానాల మీద కాకుండా.. ఎక్కువగా బిగ్ బాస్ షోలు.. మిస్ వరల్డ్ కాంటెస్టుల మీద మాట్లాడుతూ ఉంటారు ఇతర విషయాల మీద మాట్లాడినా.. ఓ కమ్యూనిస్టు లీడర్ వీటిపై మాట్లాడితే వచ్చే ఫోకస్ వేరు. ఈ విషయం ఆయనకు బాగా తెలుసు. అందుకో మరోసారి మాట్లాడారు. ఈ సారి మిస్ వరల్డ్ పోటీల మీద పడ్డారు. హైదరాబాద్‌లో ప్రెస్మీట్ పెట్టిన ఆయన తెలంగాణ మంత్రులంతా సొల్లు కార్చుకుంటూ అందాల పోటీల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించేశారు. తెలంగాణ, హైదరాబాద్ నగరం అంతా అందాల భామల చుట్టే తిరుగుతోందని ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు పెంచరు కానీ.. అందాల భామల కోసం కోట్లల్లో ఖర్చు పెట్టేది సొల్లు కార్చుకోవడానికా అని ప్రశ్నించారు. అసలు ఉద్యోగుల జీతాలు పెంచడానికి, మిస్ వరల్డ్ పోటీలకు పెట్టే పాతిక కోట్లకు లింక్ ఎక్కడ ఉందో సీపీఐ నారాయణకే తెలియాలి. గతంలో బిగ్ బాస్ మీద ఆయన ఓ రేంజ్ లో విరుచుకుపడేవారు. ఎంతగా దాన్ని ఓ అసాంఘిక కార్యకలాపాల షోగా చెప్పేవారు. కోర్టులో పిటిషన్లు కూడా వేశారు. ఆ షోపై ఆయనకు ఎందుకు అంత కోపం వచ్చిందో ఎప్పుడూ చెప్పలేదు. కానీ బీజేపీ నేతుల చెప్పినట్లుగా ఆ షో సంస్కృతి, సంప్రదాయాలను నాశనం చేస్తూ యువతను పెడదోవ పెట్టేలా చేస్తోందని ఆరోపిస్తారు. మిస్ వరల్డ్ పోటీలను కూడా బీజేపీ అనుబంధ సంస్థలు వ్యతిరేకించాయి. సీపీఐ నారాయణ కూడా వ్యతిరేకించారు.

## రూ.85వేల కోట్లతో క్రూడాయిల్ రవాణా నౌకల కొనుగోలు!



క్రూడాయిల్ సరఫరా కోసం భారత్ భారీగా నౌకలు కొనుగోలు చేయనున్నట్లు 'బ్లూమ్బర్గ్' తెలిపింది. రూ.85వేల కోట్లకు పైగా వ్యయంతో 112 నౌకలు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దేశీయ అవసరాలకు పెద్ద మొత్తంలో చమురు దిగుమతి చేసుకుంటుండంతో సొంతంగా నౌకలుంటే ఉద్రిక్త పరిస్థితుల్లోనూ ఇబ్బందులుండవని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2040లోగా ఈ నౌకలను సమీకరించనుంది.

## నేటి నుండి ఎంపీల విదేశీ పర్యటన



కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఎంపీల బృందం నేటి నుండి 33 దేశాల్లో పర్యటించనుంది. పహల్గామ్ దాడి తరువాత పరిణామాలను ప్రపంచదేశాలకు తెలియజేయాలని భారత్ నిర్ణయించింది. ఈ క్రమంలోనే అన్ని పార్టీల ఎంపీలతో ఏడు బృందాలను సిద్ధం చేసింది. ఈ ఎంపీల బృందం 10 రోజుల పాటు విదేశాల్లో పర్యటించి జూన్ మొదటి వారంలో భారత్ కు తిరిగి రానుంది.

### పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పూర్వీకులు కశ్మీరీ పండితులు..

# బ్రిటిష్ రచయిత పుస్తకంలో ఆసక్తికర విషయాలు

**పాకిస్థాన్: ఎ హార్డ్ కంట్రీ" అనే పుస్తకంలో లైవెన్ అనటోల్ ప్రస్తావన**

**పాక్ ప్రధాని షెహబాజ్ కుటుంబానిది కశ్మీరీ మూలాలు**

**బ్రిటిష్ హయాంలో పంజాబ్‌లోని జాతి ఉమ్రాకు వలస**

**భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ చర్చనీయాంశంగా షెహబాజ్ కుటుంబ నేపథ్యం**

పహల్గామ్ ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ సంబంధాలు మరింత ఉద్రిక్తంగా మారిన ప్రస్తుత తరుణంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కుటుంబ నేపథ్యానికి సంబంధించి కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాకిస్థాన్‌లో అత్యంత ధనిక కుటుంబాలలో ఒకటిగా పేరుపొందిన షరీఫ్ కుటుంబం వేళ్లు భారతదేశంలోని కశ్మీర్, పంజాబ్ ప్రాంతాలలో విస్తరించి ఉండటం గమనార్హం. ప్రముఖ బ్రిటిష్ రచయిత లైవెన్ అనటోల్ తన "పాకిస్థాన్: ఎ హార్డ్ కంట్రీ" అనే పుస్తకంలో షరీఫ్ కుటుంబం గురించి కీలక విషయాలు ప్రస్తావించారు. వారి పూర్వీకులు వాస్తవానికి కశ్మీరీ పండితులని, వారి మూలాలు కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ పట్టణంలో ఉన్నాయని అందులో పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనా కాలంలోనే షరీఫ్ కుటుంబం కశ్మీర్ నుంచి వలస వచ్చి, పంజాబ్‌లోని అమృత్‌సర్ నగరానికి సమీపంలో ఉన్న "జాతి ఉమ్రా" అనే గ్రామంలో స్థిరపడింది. ఈ గ్రామంతో షరీఫ్ కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉందని, ఇక్కడి జ్ఞాపకాలను వారు ఇప్పటికీ గుర్తుంచుకుంటారని స్థానికులు చెబుతుంటారు. ప్రస్తుత ఉద్రిక్త వాతావరణం తమను కూడా బాధిస్తోందని ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గురుద్వారాగా మారిన పూర్వీకుల హవేలీ**

జాతి ఉమ్రా గ్రామంలో షరీఫ్ కుటుంబానికి చెందిన ఒక విశాలమైన పురాతన భవనం (హవేలీ) ఉండేది. ఆ హవేలీ ఇప్పుడు ఒక గురుద్వారాగా మారిందని, అక్కడ ఉచితంగా అన్నదానం చేసేందుకు వీలుగా ఒక లంగర్ హాల్ నిర్మాణ



పనులు కూడా జరుగుతున్నాయని జాతి ఉమ్రా గ్రామవాసి హర్దీప్ సింగ్ మీడియాకు వివరించారు.హర్దీప్ సింగ్ మరిన్ని వివరాలు తెలియజేస్తూ, "1976వ సంవత్సరంలో షెహబాజ్ షరీఫ్ సోదరుడు, వ్యాపారవేత్త అయిన అబ్బాస్ షరీఫ్ తమ పూర్వీకుల హవేలీని మా గ్రామానికి విరాళంగా ఇచ్చారు. అబ్బాస్ షరీఫ్ తరచుగా ఈ ప్రాంతానికి వస్తుండేవారు, ఆయన 2013లో స్వర్గస్థులయ్యారు. అప్పట్లో ఆ హవేలీ పక్కనే ఒక చిన్న గురుద్వారా కూడా ఉండేది. గ్రామస్థులందరం కలిసి విరాళాలు సేకరించి, దానిని అభివృద్ధి చేసుకున్నాం" అని తెలిపారు.

### పాకిస్థాన్ అత్యున్నత పౌర పురస్కారం

# అందుకున్న భారతీయులు వీరే!

**ఆపరేషన్ సింధూర్‌పై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం**

**పాక్ అత్యున్నత పురస్కారం 'నిషాన్-ఎ-పాకిస్థాన్'పై తీవ్ర చర్చ**

**గతంలో పలువురు భారతీయులకు దక్కిన పాక్ అవార్డులు**



ఇటీవల జరిగిన 'ఆపరేషన్ సింధూర్' విషయంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ), కాంగ్రెస్ పార్టీల మధ్య మాటల తూటాలు పేలాయి. ఈ క్రమంలో పాకిస్థాన్ అత్యున్నత పౌర పురస్కారం 'నిషాన్-ఎ-పాకిస్థాన్' ప్రస్తావనకు వచ్చింది. బీజేపీ నేత అమిత్ మాలవీయ, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశించి మాట్లాడుతూ, ఆయన పాకిస్థాన్ అవార్డు కోసం ప్రయత్నిస్తున్నారా అన్నట్లుగా వ్యాఖ్యానించారు. దీనికి కాంగ్రెస్ కూడా ఘాటుగానే బదులిస్తూ, బీజేపీ నేతల పేర్లను ఈ అవార్డుకు సూచించింది. ఈ రాజకీయ వివాదం నేపథ్యంలో, అసలు గతంలో ఈ పాకిస్థాన్ పురస్కారాన్ని అందుకున్న భారతీయులు ఎవరు, ఎందుకు వారికి ఈ గౌరవం దక్కింది అనే ఆసక్తికర అంశాలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.

**'నిషాన్-ఎ-పాకిస్థాన్' అంటే ఏమిటి?**

'నిషాన్-ఎ-పాకిస్థాన్' అనేది పాకిస్థాన్ ప్రభుత్వం అందించే అత్యున్నత పౌర పురస్కారం. దేశానికి లేదా మానవాళికి విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు దీన్ని ప్రదానం చేస్తారు. ఇది సైనిక పురస్కారమైన 'నిషాన్-ఎ-హైదర్' తో సమానమైనది. దీని తర్వాత 'నిషాన్-ఎ-ఇంతియాజ్' రెండో అత్యున్నత పౌర పురస్కారంగా ఉంది. కళలు, సాహిత్యం, సైన్స్ లేదా ప్రజాసేవ వంటి రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి దీన్ని ఇస్తారు. ఇక 'తమ్ఘా-ఎ-పాకిస్థాన్' నాల్గవ స్థాయి పౌర పురస్కారం. అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించినా లేదా పాకిస్థాన్‌కు, మానవాళికి సేవ చేసినా ఈ అవార్డు ఇస్తారు. సాధారణంగా ఈ పురస్కారాలను పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 14) నాడు ప్రకటించి, పాకిస్థాన్ దినోత్సవం (మార్చి 23) నాడు అందజేస్తారు. పాకిస్థానీయులతో పాటు విదేశీయులకు కూడా ఈ అవార్డులను ఇస్తుంటారు.

**పాక్ పురస్కారాలు అందుకున్న భారతీయులు**

**నీరజా భానోట్ (తమ్ఘా-ఎ-పాకిస్థాన్, 1987)**

పాన్ యామ్ ఫ్లైట్ 73లో ఫ్లైట్ పర్సర్‌గా పనిచేసిన నీరజా భానోట్‌కు 1987లో మరణానంతరం 'తమ్ఘా-ఎ-పాకిస్థాన్' పురస్కారం లభించింది. 1986 సెప్టెంబర్ 5న కరాచీలో విమానం హైజాక్‌కు గురైనప్పుడు, ఆమె ప్రయాణికులను కాపాడే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయారు. అమెరికన్లను లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాదుల నుంచి ప్రయాణికుల పాస్‌పోర్టులను దాచి, అత్యవసర ద్వారం తెరిచి అనేక మందిని కాపాడారు. ముగ్గురు పిల్లలను రక్షించే క్రమంలో ఆమె ఉగ్రవాదుల కాల్పులకు బలయ్యారు. ఆమె ధైర్యసాహసాలకు గాను భారత ప్రభుత్వం అత్యున్నత శాంతికాల శౌర్య పురస్కారం 'అశోకచక్ర'ను కూడా ప్రదానం చేసింది.

**మొరార్జీ దేశాయ్ (నిషాన్-ఎ-పాకిస్థాన్, 1990)**

భారతదేశ నాలుగో ప్రధాని, జనతా పార్టీ నేత అయిన మొరార్జీ దేశాయ్‌కు 1990లో 'నిషాన్-ఎ-పాకిస్థాన్' పురస్కారం లభించింది. ఆయన పదవి నుంచి వైదొలిగిన చాలా ఏళ్ల తర్వాత ఈ గౌరవం దక్కింది. కాంగ్రెసేతర తొలి ప్రధానిగా పేరుపొందిన దేశాయ్, తన హయాంలో (1977–1979) పాకిస్థాన్‌తో సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావడానికి దౌత్యపరమైన చర్యలు చేపట్టారు. ముఖ్యంగా 1971 యుద్ధం తర్వాత ఉద్రిక్తతలు తగ్గించడానికి, అణ్వాయుధ పోటీని వ్యతిరేకిస్తూ ఆయన తీసుకున్న వైఖరిని పాకిస్థాన్ గుర్తించింది. ఇరు దేశాల మధ్య శాంతి, దౌత్య సంబంధాలకు ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు ఇచ్చారు. 'భారతరత్న'తో పాటు 'నిషాన్-ఎ-పాకిస్థాన్' అందుకున్న ఏకైక భారతీయుడు ఆయనే కావడం విశేషం. ప్రఖ్యాత నటుడు దిలీప్ కుమార్ (అసలు పేరు యూసుఫ్ ఖాన్) కు 1998లో పాకిస్థాన్ రెండో అత్యున్నత పౌర పురస్కారమైన 'నిషాన్-ఎ-ఇంతియాజ్' దక్కింది. పెషావర్‌లో జన్మించిన దిలీప్ కుమార్ సినిమాల ద్వారా ఇరు దేశాల మధ్య సాంస్కృతిక వారధిగా నిలిచారు. 'మొఘల్-ఎ-ఆజం', 'దేవదాస్' వంటి ఆయన చిత్రాలు పాకిస్థాన్‌లో కూడా ఎంతో ఆదరణ పొందాయి. ఉద్రిక్త సమయాల్లో ఈ అవార్డుపై విమర్శలు వచ్చినా, కళ ద్వారా సౌహార్దత పెంపొందించే చర్యగా దీన్ని సమర్థించారు. పెషావర్‌లోని ఆయన పూర్వీకుల ఇంటిని 2014లో పాక్ ప్రభుత్వం జాతీయ వారసత్వ సంపదగా ప్రకటించింది.

**సయ్యద్ అలీ షా గీలానీ (నిషాన్-ఎ-పాకిస్థాన్, 2020)**

కశ్మీర్ వేర్పాటువాద నాయకుడైన సయ్యద్ అలీ షా గీలానీకి 2020లో 'నిషాన్-ఎ-పాకిస్థాన్' పురస్కారం లభించింది. "పాకిస్థాన్‌కు మద్దతును కూడగట్టడం, దశాబ్దాలుగా కశ్మీర్ సమస్యకు కట్టుబడి ఉండటం" వంటి కారణాలతో ఆయనకు ఈ అవార్డు ఇచ్చారు. గీలానీ 1950ల నుంచి జమాత్-ఎ-ఇస్లామీ కశ్మీర్‌తో సంబంధాలు కలిగి ఉండి, ఆ సంస్థలో కీలక నేతగా వ్యవహరించారు. ఆయన సోపోర్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా కూడా ఎన్నికయ్యారు. 2021లో గీలానీ మరణించారు.

**సయ్యద్నా ముఫద్దల్ సైఫుద్దీన్ (నిషాన్-ఎ-పాకిస్థాన్, 2023)**

దావూదీ బోహ్రా వర్గ ఆధ్యాత్మిక గురువు సయ్యద్నా ముఫద్దల్ సైఫుద్దీన్‌కు 2023లో పాకిస్థాన్ ప్రభుత్వం 'నిషాన్-ఎ-పాకిస్థాన్' పురస్కారాన్ని ప్రదానం చేసింది. పాకిస్థాన్‌లో కూడా ఆయన వర్గానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో నివసిస్తున్నారు. విద్య, వైద్యం, మత సామరస్యం వంటి రంగాల్లో ఆయన చేస్తున్న సేవలను పాకిస్థాన్ గుర్తించింది. కరాచీలోని లా స్కూల్, జామియా-తుస్-సైఫియా వంటి ఆయన సంస్థలు సామాజిక అభివృద్ధికి దోహదపడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మానవతా సేవలు, సామాజిక సేవ, విద్య, పర్యావరణ పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషికి ఈ గౌరవం దక్కింది. ఇస్లామాబాద్‌లో పాక్ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ విధంగా, రాజకీయ, సామాజిక, కళా, మానవతా రంగాల్లో విశేష సేవలు అందించిన కొందరు భారతీయులకు పాకిస్థాన్ తమ పౌర పురస్కారాలతో గౌరవించింది. ఇవి ఇరు దేశాల మధ్య ఉన్న సంక్లిష్టమైన, బహుముఖ సంబంధాలను ప్రతిబింబిస్తాయి.

## తెరుచుకోనున్న అట్టారి - వాఘా గేట్లు



పహల్గాం దాడి అనంతరం మూసివేసిన అట్టారి-వాఘా గేట్లు నేడు (బుధవారం) తిరిగి తెరుచుకోనున్నాయి. సిబ్బంది నేటి నుంచి బీటింగ్ రీట్రీట్ నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించే ఈ బీటింగ్ రీట్రీట్ ను చూసేందుకు సామాన్య ప్రజలకు కూడా అనుమతి ఇవ్వనున్నారు. దీన్ని చూసేందుకు ప్రజలు చాలా ఆసక్తిగా ఉంటారు.

## గోల్డెన్ డోమ్తో రక్షణ: ట్రంప్



అమెరికా రక్షణ వ్యవస్థను అత్యాధునిక 'గోల్డెన్ డోమ్' టెక్నాలజీతో మరింత పటిష్ఠం చేయనున్నట్లు ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ప్రస్తుతమున్న **THAAD, MIM-104 Patriot, ABMD** రక్షణ వ్యవస్థలతో పోలిస్తే గోల్డెన్ డోమ్ మరింత శక్తిమంతమైనదని తెలిపారు. దీని కోసం $175B అవసరం కాగా తొలుత %వి25దీ% కేటాయించ ‌ాన్నట్లు పేర్కొన్నారు. తన పదవికాలం ముగిసేలోగా దీనిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ట్రంప్ తెలిపారు.

## హైదరాబాద్‌లో సేజ్ స్కూల్ ప్రాంగణంలో హైడ్రా కూల్చివేతలు

**మేడిపల్లి సేజ్ స్కూల్‌లో అక్రమ కట్టడాల కూల్చివేత**

**హైదరాబాద్-వరంగల్ లింక్ రోడ్డుపై కబ్జా ఆరోపణలు**

**స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు**

**ట్రాఫిక్ అంతరాయం, ప్రజా రవాణాకు ఇబ్బందులు**

**స్థల పరిశీలన అనంతరం అక్రమ నిర్మాణాలని నిర్ధారణ**



హైదరాబాద్‌లోని మేడిపల్లి ఆర్ఏఆర్ కాలనీలోని సేజ్ పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు బుధవారం కూల్చివేశారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి అనుసంధాన మార్గంలో ఈ అక్రమ నిర్మాణాలు ఉన్నాయని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో అధికారులు ఈ చర్యలు చేపట్టారు. పాఠశాల యాజమాన్యం కీలకమైన లింక్ రోడ్డులోని కొంత భాగాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిందని స్థానికులు కొన్నాళ్లుగా ఆరోపిస్తున్నారు. ఈ ఆక్రమణల వల్ల తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కబ్జాపై కాలనీ వాసులు 15 ఏళ్లుగా పోరాడుతున్నారని తెలిసింది.అందిన ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా అధికారులు, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు ఈ తనిఖీల్లో నిర్ధారణ అయింది. దీంతో బుధవారం ఉదయం పోలీసు బందోబస్తు నడుమ ప్రత్యేక బృందాలు పాఠశాల వద్దకు చేరుకుని, రోడ్డుపైకి చొచ్చుకుని వచ్చిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయి. ఈ కూల్చివేతల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

## జిల్లాల పునర్ విభజనపై ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాలు

**జిల్లాల పునర్విభజన హామీలపై నివేదిక ఇవ్వాలని ఆదేశం**



జిల్లాల పునర్విభజన అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మంత్రులతో జిల్లాల పునర్విభజనపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సమయంలో పలు ప్రాంతాల్లో జిల్లా కేంద్రాల ఏర్పాటుకు చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, కూటమి ఇచ్చిన హామీలపై త్వరితగతిన నివేదిక సమర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నేతలతో పాటు వివిధ సంఘాల వారిని భాగస్వాములను చేసి నివేదిక రూపొందించాలని ఆయన తెలిపారు. మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా, పోలవరం ముంపు మండలాలు, ప్రత్యేక జిల్లాల ఏర్పాటు వంటి హామీలను అమలు చేసే అంశంపై చర్యలు వేగవంతం చేయాలని చంద్రబాబు ఈ సందర్భంగా సూచించారు.

# టర్కీ, అజర్‌బైజాన్‌లకు భారత పర్యాటకుల షాక్!

**టర్కీ, అజర్‌బైజాన్ వీసా దరఖాస్తుల్లో 42 శాతం క్షీణత**

**'ఆపరేషన్ సిందూర్' తర్వాత మారిన భారతీయుల వైఖరి**

**ఢిల్లీ, ముంబై వంటి నగరాల నుంచి భారీగా తగ్గిన ప్రయాణికులు**

**వీసాలు రద్దు చేసుకుంటున్న యువత, మహిళలు**

**వియత్నాం, ఇండోనేషియా, ఈజిప్టులకు పెరుగుతున్న ఆదరణ**




భారత్ నుంచి టర్కీ, అజర్‌బైజాన్ దేశాలకు వెళ్లే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పడిపోయినట్లు వీసా ప్రాసెసింగ్ సంస్థ అట్లీస్ తాజాగా వెల్లడించింది. ఈ రెండు దేశాలకు వీసా దరఖాస్తులు ఇటీవల ఏకంగా 42 శాతం మేర తగ్గినట్లు సదరు సంస్థ తన నివేదికలో పేర్కొంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు ఈ దేశాలు బహిరంగంగా మద్దతు తెలపడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ పరిణామంపై భారతీయుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుండటంతో, ఆయా దేశాల పర్యటనలపై మనవాళ్లు ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. అట్లీస్ నివేదిక ప్రకారం, ఈ ఏడాది జనవరి-మార్చి మధ్యకాలంలో వాస్తవానికి టర్కీ, అజర్‌బైజాన్‌లకు వీసా దరఖాస్తులు గత ఏడాదితో పోలిస్తే 64 శాతం పెరిగాయి. అయితే, 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. ముఖ్యంగా ఢిల్లీ, ముంబై వంటి మెట్రో నగరాల నుంచి ఈ దేశాలకు వెళ్లేవారి సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ ప్రాంతాల నుంచి వచ్చే దరఖాస్తుల్లో 53 శాతం తగ్గుదల కనిపించగా, ఇండోర్, జైపూర్ వంటి టైర్-2 నగరాల నుంచి కూడా ప్రయాణికులు మొగ్గు చూపడం లేదని అట్లీస్ తెలిపింది. కుటుంబ సమేతంగా వెళ్లేవారు, గ్రూపు వీసా దరఖాస్తుల్లో 49 శాతం క్షీణత నమోదవ్వగా, ఒంటరిగా ప్రయాణించే వారి సంఖ్య కూడా 27 శాతం తగ్గింది. వీసా ప్రక్రియ కొనసాగుతున్న దశలో కూడా అనేకమంది తమ ప్రయాణాలను విరమించుకుంటున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా 25 నుంచి 34 ఏళ్ల వయసున్న యువత తమ నిర్ణయాలను వేగంగా మార్చుకుంటున్నారు. టర్కీకి దరఖాస్తు చేసుకున్న వారిలో దాదాపు 70 శాతం మంది తమ వీసాలను రద్దు చేసుకున్నట్లు అట్లీస్ పేర్కొంది. మహిళా పర్యాటకులు అయితే పూర్తిగా తమ ప్రయాణాలను మార్చుకుని, ప్రత్యామ్నాయంగా వియత్నాం, ఇండోనేషియా, ఈజిప్టు వంటి దేశాలను ఎంచుకుంటున్నారు. ఈ దేశాలకు వీసా దరఖాస్తులు ఇటీవల 31 శాతం పెరిగాయి. ఒకప్పుడు ఇస్తాంబుల్, బాకు వంటి నగరాలకు వెళ్లాలని ఆలోచించిన భారత పర్యాటకులు, ఇప్పుడు ప్రశాంతమైన, రాజకీయంగా తటస్థంగా ఉండే ప్రాంతాలపై దృష్టి సారిస్తున్నారని అట్లీస్ విశ్లేషించింది. వివాదాస్పద దేశాలకు వెళ్లవద్దని ఎవరూ ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని, అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా పర్యాటకులే స్వయంగా నిర్ణయాలు తీసుకుని, ప్రత్యామ్నాయాలను ఎంచుకుంటున్నారని తాజా నివేదిక స్పష్టం చేసింది.


## హైదరాబాద్‌లో మయన్మార్ వాసుల కలకలం..

# నకిలీ పత్రాలతో ఆధార్, పాన్!

**- హైదరాబాద్‌లో మయన్మార్ జాతీయుల అరెస్ట్**

**- ఏళ్ల క్రితం భారత్‌లోకి అక్రమ ప్రవేశం - నకిలీ పత్రాలతో ఆధార్, పాన్, గ్యాస్ బుక్‌లు**

**- మదర్సా టీచర్ల సాయంతో మోసం - ఇద్దరు నిందితులు పరారీ, పోలీసుల గాలింపు**




హైదరాబాద్ నగరంలో అక్రమంగా నివసిస్తూ, నకిలీ పత్రాలతో భారత ప్రభుత్వ గుర్తింపు కార్డులు పొందిన మయన్మార్ దేశస్థుల ముఠా గుట్టు రట్టయింది. రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులు మంగళవారం జరిపిన దాడుల్లో మయన్మార్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు. వీరు కొన్నేళ్ల క్రితం మయన్మార్ నుంచి అక్రమంగా మన దేశంలోకి ప్రవేశించి, ఇక్కడ తప్పుడు ధృవపత్రాలు సృష్టించి ఆధార్ కార్డులు, పాన్ కార్డులు, గ్యాస్ కనెక్షన్లు పొందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో మదర్సాలో పనిచేసే కొందరు ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తేలింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, మయన్మార్‌కు చెందిన మహ్మద్ అమీన్, ఆయన భార్య మహ్మద్ రుమానా అక్తర్, వారి కుమారుడు మహ్మద్ నయీమ్ 2011 సంవత్సరంలో అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించారు. అనంతరం 2014లో హైదరాబాద్ నగరానికి చేరుకుని, పెద్ద అంబర్‌పేట్ ప్రాంతంలో నివాసం ఏర్పరచుకున్నారు. మహ్మద్ అమీన్ స్థానికంగా ఓ బ్యాటరీ దుకాణాన్ని నడుపుతున్నాడు. వారు అక్రమంగా ఆధార్ కార్డులు పొందిన వైనంపై పోలీసులు దృష్టి సారించారు. మదర్సాలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మహ్మద్ హారీస్, అయాజ్‌ల సహాయంతో మహ్మద్ అమీన్ మంచాల గ్రామంలోని మీ-సేవా కేంద్రం ద్వారా ఆధార్ కార్డు సంపాదించినట్లు విచారణలో తేలింది. ఆ తర్వాత, నకిలీ వివాహ ధృవపత్రాన్ని సృష్టించి, దాని ఆధారంగా తన భార్య రుమానా అక్తర్‌కు కూడా ఆధార్ కార్డు ఇప్పించాడు. ఇక వీరి కుమారుడైన నయీమ్‌కు, మయన్మార్ నుంచే అక్రమంగా వచ్చి బాలాపూర్‌లో స్థిరపడిన షోయబ్ మాలిక్ అనే వ్యక్తి నకిలీ పత్రాలతో ఆధార్ కార్డు వచ్చేలా చేశాడు. ఈ కుటుంబం తప్పుడు పత్రాలను సమర్పించి ప్రభుత్వ గుర్తింపు కార్డులు పొందిన వ్యవహారంపై పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులు వారిని అరెస్టు చేశారు. వారి నుంచి నకిలీ ఆధార్ కార్డులతో పాటు, వాటి ఆధారంగా పొందిన పాన్ కార్డులు, గ్యాస్ బుక్‌లు, బ్యాంకు ఖాతాలు, పాస్‌బుక్‌లు వంటి ఇతర కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరికి సహకరించిన అయాజ్, షోయబ్ మాలిక్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని పోలీసులు వివరించారు.

# మన బ్రహ్మోస్ సత్తా చాటింది: రష్యాలో భారత రాయబారి

**- పాక్‌పై 'ఆపరేషన్ సిందూర్'లో భారత ఆయుధాల విజయవంతం**

**- "మేడ్ ఇన్ ఇండియా" ఆయుధాల సామర్థ్యం రుజువు: - రాయబారి వినయ్ కుమార్**

**- భారత్-రష్యా మధ్య మరింత బలపడుతున్న రక్షణ ఒప్పందాలు**

**- బ్రహ్మోస్ సహా స్వదేశీ ఆయుధాల పనితీరుపై ప్రశంసలు - కశ్మీర్ అంశం ద్వైపాక్షికమేనని రష్యాకు స్పష్టం**

**- ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు చర్చలకు భారత్ మద్దతు**




భారత్, రష్యాల మధ్య రక్షణ రంగంలో సహకారం అంతకంతకూ బలపడుతోందని, ముఖ్యంగా పాకిస్థాన్‌పై చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో 'మేడ్ ఇన్ ఇండియా' రక్షణ పరికరాల సమర్థత నిస్సందేహంగా రుజువైందని రష్యాలో భారత రాయబారి వినయ్ కుమార్ స్పష్టం చేశారు. ఓ రష్యన్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక విషయాలను వెల్లడించారు. "ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత దృఢపడ్డాయి. మనం కేవలం సైనిక పరికరాలను కొనడం, అమ్మడం మాత్రమే కాదు, రక్షణ ఉత్పత్తుల సంయుక్త అభివృద్ధి మరియు ఉత్పత్తిలోనూ పాలుపంచుకుంటున్నాం. భారత్‌లో తయారైన బ్రహ్మోస్ (రష్యా-భారత్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన సూపర్‌సోనిక్ యాంటీ-షిప్ క్షిపణి) వంటి ఆయుధాలు తమ సామర్థ్యాన్ని అనేకసార్లు నిరూపించుకున్నాయి. ముఖ్యంగా మే 7 నుంచి 10వ తేదీ మధ్య జరిగిన ఆపరేషన్ సమయంలో ఇది స్పష్టమైంది. కాబట్టి, ఈ రంగంలో మన సంబంధాలు మరింత వృద్ధి చెందుతాయని నేను నమ్ముతున్నాను" అని అంబాసిడర్ వినయ్ కుమార్ 'ఇజ్వెస్తియా' పత్రికకు తెలిపారు. రష్యా నుంచి భారత్‌కు కొత్త రక్షణ పరికరాల సరఫరా గురించి చర్చలు జరుగుతున్నాయా అన్న ప్రశ్నకు, సైనిక మరియు సైనిక-సాంకేతిక సహకారానికి సంబంధించిన అన్ని అంశాలపై ఇరు దేశాలు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని, ఇది ద్వైపాక్షిక సంబంధాలలో కీలకమైన భాగంగా కొనసాగుతోందని కుమార్ నొక్కిచెప్పారు. పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ), భారత డీజీఎంఓకు ఫోన్ చేసిన తర్వాతే ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ద్వైపాక్షిక ప్రాతిపదికన కుదిరిందన్న న్యూఢిల్లీ వైఖరిని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు. "పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అనంతరం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌లతో సహా పలువురు నేతలు భారత ప్రతినిధులతో మాట్లాడారు. అయితే, కశ్మీర్ అంశం ఇరు దేశాలకు సంబంధించిన విషయమని, మూడో పక్షం మధ్యవర్తిత్వానికి ఆస్కారం లేదనే విధానాన్ని భారత్ స్థిరంగా అనుసరిస్తోంది. ఈ వైఖరి ఇప్పటికీ కొనసాగుతోంది" అని కుమార్ ప్రముఖ రష్యన్ వార్తాపత్రికకు వివరించారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో మతపరమైన గుర్తింపును నిర్ధారించుకున్న తర్వాత 26 మంది పర్యాటకులపై అతి సమీపం నుంచి కాల్పులు జరిపిన ఉగ్రదాడికి భారత్ ప్రతిస్పందించినప్పుడే పాకిస్థాన్‌తో ప్రస్తుత ఉద్రిక్తతలు తలెత్తాయని రాయబారి గుర్తుచేశారు. ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కారం కోసం ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునివ్వడం, అందుకు సహాయం చేయడానికి సుముఖత వ్యక్తం చేయడంపై అడిగిన ప్రశ్నకు, కుమార్ స్పందిస్తూ.. వివాదానికి ముగింపు పలికేందుకు సంబంధిత పక్షాల మధ్య చర్చలకు భారత్ మద్దతిస్తుందని అన్నారు. "చర్చలను, శాంతియుత పరిష్కారాన్ని ప్రోత్సహించడానికి మేమేమైనా చేయగలిగితే, అందుకు మేం సిద్ధంగా ఉంటాం" అని ఆయన జోడించారు.

## సొంత నేరంపై దర్యాప్తు చేయాలని

# దొంగను అడుగుతామా? పాక్ కూడా అంతే: మిస్రీ

**భారత్ 'ఆపరేషన్ సిందూర్ అవుట్‌రీచ్**

**పాక్ ఉగ్రసంబంధాలపై ప్రపంచానికి వివరించేందుకు ప్రత్యేక బృందాలు**

**పహల్గామ్ దాడిపై పాకిస్థాన్ సంయుక్త దర్యాప్తు**

**ప్రతిపాదనను ఖండించిన భారత్**




'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన నేపథ్యంలో, ఉగ్రవాదంతో పాకిస్థాన్‌కు ఉన్న ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలను ప్రపంచ దేశాల ముందుంచేందుకు "ఆపరేషన్ సిందూర్ అవుట్‌రీచ్" పేరుతో భారత్ ఒక సాహసోపేతమైన దౌత్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ భారీ ప్రచారంలో భాగంగా, మాజీ మంత్రులు, అనుభవజ్ఞులైన దౌత్యవేత్తలు, సీనియర్ రాజకీయ నాయకులతో కూడిన 59 మంది పార్లమెంటు సభ్యుల ఏడు ఉన్నతస్థాయి బృందాలు మే 21 నుంచి జూన్ 5 మధ్య 33 దేశాల్లో పర్యటించనున్నాయి. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పర్యటనకు వెళ్లనున్న బృందాలకు వివరాలు అందిస్తూ మీడియాతో మాట్లాడారు."భారత్ నాలుగు దశాబ్దాలకు పైగా సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటోంది. ఇటువంటి కార్యకలాపాలను ఎదుర్కోవడంలో మేము ఒక కొత్త, దృఢమైన విధానాన్ని అవలంబించాం," అని స్పష్టం చేశారు. పహల్గామ్ దాడిపై పాకిస్థాన్ సంయుక్త దర్యాప్తు ప్రతిపాదనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. "భారత భూభాగంపై జరిగిన ఉగ్రదాడులపై దర్యాప్తులో పాకిస్థాన్‌ను భాగస్వామిని చేయడం అంటే, దొంగ చేతికే తాళాలు అప్పగించినట్లు అవుతుంది. సొంత నేరంపై దర్యాప్తు చేయాలని దొంగను అడుగుతామా? పాక్ తో సంయుక్త దర్యాప్తు కూడా అంతే" అని వ్యాఖ్యానించారు. ప్రతి బృందం కూడా పాకిస్థాన్ సైన్యం, ఐఎస్ఐ ఉగ్రవాదాన్ని ఎలా ప్రోత్సహిస్తున్నాయో తెలిపే రహస్య దస్త్రాలు, నిఘా సమాచారంతో పాటు, నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాద శిబిరాలపై ఇటీవల జరిపిన 'ఆపరేషన్ సిందూర్' నుంచి లభించిన ప్రత్యక్ష ఆధారాలను కూడా తీసుకెళ్లనుంది. టోక్యో నుంచి వాషింగ్టన్ వరకు, బ్రస్సెల్స్ నుంచి జకార్తా వరకు వ్యూహాత్మక రాజధానుల్లో ఈ ప్రచారం సాగనుంది. ఎంపీలు విదేశీ ప్రభుత్వాలు, పార్లమెంటేరియన్లు, మీడియా, పౌర సమాజం, ప్రవాస భారతీయులు, అంతర్జాతీయ సంస్థలతో సమావేశమై పాక్ ఉగ్ర కార్యకలాపాలపై సాక్ష్యాలు సమర్పిస్తారు.

# షాద్ నగర్ ఏసిపి రంగస్వామిని అభినందించిన రాష్ట్ర డిజిపి జితేందర్

**కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్యను చేదించినందుకు..**

**డిజిపి అభినందనలు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది - ఏసిపి రంగస్వామి**



ఓ హత్య కేసులో మిస్టరీని చేదించి కేసును కొలిక్కి తెచ్చిన నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఏసిపి రంగస్వామిని స్వయాన రాష్ట్ర డిజిపి జితేందర్ అభినందించారు. షాద్ నగర్ డివిజన్ పరిధిలోని కడ్తాల పోలీస్ స్టేషన్లో జరిగిన ఓ హత్య కేసును ఎసిపి రంగస్వామి బృందం దర్యాప్తు జరిపారు. కడ్తాల అప్పటి సీఐ శివ ప్రసాద్, ఎస్సై వరప్రసాద్ మరియు హెూంగార్డు పాండు నేతృత్వంలోని బృందాన్ని డీజీపీ జితేందర్ గురువారం అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కడ్తాల పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 130/24 కేసులో సెక్షన్లు 302, 202, 364, 120బి ఐపీసీ మరియు ఎస్సీ, ఎస్టీ చట్టంలోని 3(2) వి పలు సెక్షన్ల కింద నమోదైన కేసులో ఈ దారుణ హత్య కేసును పరిష్కరించడంలో ఏసీపీ రంగస్వామి బృందం అత్యంత కీలకంగా వ్యవహరించారు. కేసుకు సంబంధించి ఎంతో అంకితభావంతో దర్యాప్తు జరిపి, కేసులో పురోగతి పట్ల కృషి చేసినందుకు రాష్ట్ర డిజిపి అభినందిస్తూ రివార్డును అందజేశారు. అదేవిధంగా వృత్తి నైపుణ్యం న్యాయం పట్ల నిబద్ధత ను పరిగణలోకి తీసుకొని ఎసిపి రంగస్వామిని అభినందించారు. షాద్ నగర్ ఎసిపిగా పనిచేసిన రంగస్వామి ఇటీవలే జరిగిన సాధారణ బదిలీల్లో బిజెపి కార్యాలయానికి ఆయన రిపోర్ట్ చేశారు. ప్రస్తుతానికి ఏసీపీ రంగస్వామి ఇంకా రిలీవ్ కాలేదు. బదిలీ సమయంలో రంగస్వామి ఈ అవార్డును సాక్షాత్తు డిజిపి జితేందర్ చేతుల మీదుగా అందుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తన బదిలీ తర్వాత ఇలాంటి అత్యున్నత అభినందనలు రావడం ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఏసీపీ రంగస్వామి స్థానిక మీడియాకు తెలిపారు..

# పహల్గామ్ ఘటనపై ప్రధాని మోదీ సర్కారుపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే తీవ్ర ఆరోపణలు

**భద్రత కల్పించకపోవడం వల్లే 26 మంది చనిపోయారని విమర్శ**

**ఇంటెలిజెన్స్ రిపోర్ట్‌తోనే ప్రధాని కశ్మీర్ ట్రిప్ రద్దు చేసుకున్నారని వ్యాఖ్య**

**ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర ఆగ్రహం**

**చిన్న యుద్ధాలంటూ సైన్యాన్ని కించపరిచారంటూ మండిపాటు**




పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ఘటనపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మరోసారి కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన భద్రత కల్పించకపోవడం వల్లే ఈ దారుణం జరిగిందని ఆయన ఆరోపించారు. ఉగ్రదాడికి సంబంధించి నిఘా వర్గాల నుంచి ముందే సమాచారం అందినందువల్లే ప్రధాని మోదీ తన కశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఖర్గే పునరుద్ఘాటించారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. కర్ణాటక ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా విజయనగర జిల్లా హొసాపేటలో జరిగిన కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. పహల్గామ్ వెళ్లిన పర్యాటకులకు పోలీసులు, బీఎస్ఎఫ్ లేదా సైన్యం నుంచి ఎలాంటి భద్రత కల్పించలేదని, దీని ఫలితంగానే 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్ద ఘటన జరిగినా, భద్రతా వైఫల్యంపై ప్రధాని మోదీ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమని విమర్శించారు. పాకిస్థాన్‌తో మనం చిన్నపాటి యుద్ధాలు చేస్తున్నామని, అయితే పాక్ మనల్ని తక్కువ అంచనా వేస్తూ, చైనా మద్దతుతో దాడులకు ప్రయత్నిస్తోందని ఆయన మండిపడ్డారు. ఇలాంటి దాడులను దేశం ఎప్పటికీ సహించబోదని స్పష్టం చేశారు. ఈ విషయంలో దేశమంతా ఐక్యంగా ఉందని, దేశ వ్యతిరేక శక్తులపై పోరాటంలో ప్రభుత్వానికి తాము మద్దతు ఇస్తున్నామని తెలిపారు. దేశమే అన్నింటికన్నా ముఖ్యమని, ఆ తర్వాతే మతం, కులం వంటి అంశాలని అన్నారు. అయితే, ప్రధాని పర్యటన సమయంలో నిఘా వర్గాలు సమాచారం అందించాయని, కానీ సామాన్య పౌరులను, పేదలను మాత్రం కాపాడుకోలేకపోయామని విచారం వ్యక్తం చేశారు. వివిధ దేశాలకు పార్లమెంటు సభ్యుల బృందాలను పంపించే విషయంలో కేంద్ర ప్రభుత్వం తమ పార్టీని సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. అయినప్పటికీ, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మౌనంగా ఉన్నామని, మన దేశం తరఫున మాట్లాడేందుకు కాంగ్రెస్ ఎంపీలను పంపిస్తున్నామని ఖర్గే వివరించారు.

**ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం**

మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర తీవ్రంగా స్పందించారు. 'ఆపరేషన్ సిందూర్' వంటి సైనిక చర్యలను 'చిన్నపాటి యుద్ధం' అనడంపై ఆయన ధ్వజమెత్తారు. భారత సైన్యం పాకిస్థాన్‌లోకి చొచ్చుకెళ్లి అక్కడి ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడమే కాకుండా, వంద మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టిన విషయాన్ని కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు అర్థం చేసుకోలేకపోతున్నారని విమర్శించారు. సైన్యం ధైర్యసాహసాలను కించపరిచేలా ఖర్గే మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# దేశ అభివృద్ధిలో “రాజీవ్” హస్తం

**షాద్ నగర్ ఎమ్మెల్యే “వీర్లపల్లి శంకర్”**

**షాద్ నగర్ లో మాజీ భారత ప్రధాని రాజీవ్ గాంధీ 34 వర్ధంతి నివాళి**

**రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించిన కాంగ్రెస్ శ్రేణులు**

**ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్ అందజేసిన కాంగ్రెస్ పార్టీ**



అతిపిన వయసులోనే భారతదేశ ప్రధానమంత్రి పదవిని అధిష్టించి దేశ భవిష్యత్తుకు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు నేటి అభివృద్ధికి ఎంతో కీలకమని భారత ఆధునిక స్వామికుడు కీర్తిశేషులు రాజీవ్ గాంధీ అని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కే చెన్నయ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాజీవ్ గాంధీ 34 వర్ధంతి నివాళిని ఘనంగా అర్పించారు. ఈ సందర్భంగా ఫరూక్ నగర్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శంకర్ కాంగ్రెస్ శ్రేణులు కలిసి పెద్ద ఎత్తున పూలమాలలు అర్పించి నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బ్రెడ్ పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడుతూ.. అతిపిన్న వయసులోనే ప్రధాన మంత్రి పదవిని అధిష్ఠించిన రాజీవ్ గాంధీ దేశ భవిష్యత్తుకు నాడు నాటిన అభివృద్ధి మొక్కలు నేడు వృక్షాలై ఫలాలు అందిస్తున్నాయనీ అన్నారు. ఆయన దూరదృష్టితో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆర్థిక వ్యవస్థ సరళీకృతం చేయడం, పరిశ్రమలకు రాయితీలు, పంచా యతీ రాజ్ వ్యవస్థ పటిష్ఠత వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారనీ, 21వ శతాబ్దిలో దేశాన్ని నూతన పథంలో నడిపించేలా దిశానిర్దేశం చేశారన్నారు. ఆయన యువతరంలో శక్తిమంతమైన మార్పును ఆకాక్షించి కంప్యూటర్ యుగానికి నాంది పలకడంతో ఇప్పుడు దేశం ప్రగతి దిశలో పయనిస్తోందనీ నాటి ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ ముష్కరుల చేతిలో హత్యకు గురవడంతో దేశ ప్రజల ఆకాంక్ష, ఒత్తిడి మేరకు ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ 1984 అక్టోబర్ 31న భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టారనీ వివరించారు. 1984 డిసెంబర్ లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో రాజీవ్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ రికార్డు స్థాయిలో 414 స్థానాలు గెలిచిందనీ దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లాలనే ప్రధానలక్ష్యంతో 'పబ్లిక్ కాల్ ఆఫీస్' (పీసీఓ) విధానాన్ని ప్రవేశ పెట్టడంతో సాధారణ ప్రజలకు కూడా కమ్యూనికేషన్ కనెక్ట విటీ పెరిగింది. రాజీవ్ ప్రభుత్వం అత్యాధునిక టెలి కమ్యూ నికేషన్ టెక్నాలజీని దేశీయంగా అభివృద్ధి చేయడానికి 1984లో 'సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్' స్థాపించిందనీ 19855 విద్యను సార్వత్రికీకరించడానికి ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ'ని ప్రారంభించారనీ దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఓపెన్ యూనివర్సిటీల ప్రారంభానికి ఇది స్ఫూర్తిగా నిలిచిందన్నారు. బడుగు, బల హీన వర్గాలకు ప్రయోజనం కలిగేలా జాతీయ విద్యా విధా నాన్ని విస్తరించాలనే లక్ష్యంతో 1986లో రాజీవ్ గాంధీ దేశంలో 'జవహర్ నవోదయ విద్యాలయాల'ను ప్రారంభించారు. గ్రామీణాభిమురికి ప్రాధాన్యమిస్తూ పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకున్నారు. రాజీవ్ంధీ ప్రభుత్వం 1989 మే 15వ తేదీన చేసిన 64వరాజ్యాంగ సవరణకు అనుగుణంగా పీవీ నరసింహారావు ప్రభుత్వం 1993లో చేసిన 73వ రాజ్యాంగ సవరణతోపంచాయతీలకు రాజ్యాంగ ప్రతిపత్తి లభించింది. మానవ వనరుల అభివృద్ధి కోసం ప్రత్యేక వ్యవస్థ ఉండాలనే తలంపుతో రాజీవ్ గాంధీ 1985లో దీనికోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి పీవీ నరసింహారావుకు అప్పగించారు. దేశ రాజకీయాల్లో ముఖ్యంగా 1967 తర్వాత పార్టీ ఫిరాయింపులు ఎక్కువవడంతో వాటి కట్టడికి రాజీవ్ నడుం కట్టారు. 1985లో 52వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 'పార్టీ ఫిరా యింపుల నిరోధక చట్టాన్ని 10వ షెడ్యూల్లో చేర్చడంతో పార్టీలు మారే ప్రజాప్రతినిధుల సభ్యత్వాన్ని రద్దు చేసే అవ కాశం ఏర్పడింది. రాజీవ్ గాంధీ చేసిన చరిత్రాత్మక చట్టాల్లో 61 వరాజ్యాంగ సవరణ బిల్లు కీలకమైంది. దేశ నిర్మాణంలో యువతను భాగస్వాములుగా మార్చాలనే ఉన్నతమైన ఆశ యంతో ఈ చట్ట సవరణ ద్వారా ఓటు వేసే కనీస వయసును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించారు. దీంతో దేశ రాజకీయాల్లో యువత ప్రాధాన్యం పెరగడమే కాకుండా వారు తమ ఆశయాలకు అనుగుణంగా ప్రజాప్రతి నిధులను ఎన్నుకునే అవకాశాలు ఏర్పడ్డాయన్నారు. రాజీవ్ ప్రచారంలో హడా విడిగా ఉన్న గాంధీ 1991లో ఎన్నికల సమయంలో మే 21 రాత్రి పెరంబదూర్ లో ప్రచారం నిర్వహిస్తుండగా మనోభాంబు పేల్చి ఎల్టిటిఈ తీవ్రవాదులు హత్య చేశారని దేశం కోసం రాజీవ్ గాంధీ ప్రాణాలు అర్పించారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, నేతలు అగ్గనూర్ బస్వ%శీ%, చెంది తిరుపతి రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,, రఘు నాయక్, జ్మమద్ ఖాన్,అందే మోహన్,సాయి వంశీ,హరినాద్ రెడ్డి, ఇబ్రహీం,మురళి మోహన్(అప్పి), కొప్పునూరి ప్రవీణ్,,రాజేష్ గౌడ్,ఖదీర్, మాధువలు,అర్జున్, సీతారాం,నవీన్,ఖదీర్,మంగ అశోక్, నీరటి వాసు, మన్నే రవి, రాజు,గంగమోని సత్తయ్య, సాయి కుమార్ ,శేకారప్ప ,రవితేజ,ముబారక్ అలీ ఖాన్,బచ్చలి నరేష్, విగ్నేష్ రెడ్డి, శంకర్,మంగ మధు,, మహమ్మద్,తదితరులు పాల్గొన్నారు.








తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిదిలోని బొంతపల్లి పారిశ్రామికవాడలో గల హెటిరో డ్రగ్స్ యునిట్ – 1 నుండి అండర్ గ్రౌండ్ నాలాల ద్వారా వేలువడుతున్న రసాయనాల వల్ల పూర్తిగా నాషన మవుతున్న దోమడుగు గ్రామానికి చెందిన నల్లకుంట విడియోలు

## నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది



తెలంగాణ రాష్ట్ర మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మేదరి మహేంద్ర సంఘం అధ్యక్షులు శ్రీ కొంటు ముకుందం గారి కుమారుడు సుమన్ మరియు నవ్య గారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న పెద్దలు , రాజ్యసభ సభ్యులు శ్రీ ఆర్ కృష్ణయ్య గారు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆరు రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీ అంబర్పేట్ శ్రీనివాస్ యాదవ్ , హైందవి ఇన్స్టిట్యూషన్స్ కాలేజీల అధినేత, కాంటెస్టెడ్ ఎంపీ శ్రీ గడ్డం శ్రీనివాస్ యాదవ్ , మాజీ మంత్రివర్యులు శ్రీ సి . కృష్ణ యాదవ్ తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు శ్రీ బేరి రామచంద్ర యాదవ్ , బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఆర్కే సాయన్న ముదిరాజ్, వనపర్తి జిల్లా గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్షులు మధు యాదవ్ యువ నాయకులు శ్రీ అందెలకుమార్ యాదవ్ గారు, తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక నాయకులు మరియు ముఖ్య సలహాదారు శ్రీ పట్లూరి కృష్ణమోహన్, గౌరవనీయులు శ్రీ తమ్మా చంద్రమౌళి చైర్మన్ శ్రీ ఇస్మాయిల్ చేతిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సూరారం డివిజన్ ఉపాధ్యక్షులు శ్రీ సిద్ధార్థ ముదిరాజ్ గారు , కొంటువారి వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో నిండుగా జీవించాలని అందరూ ఆశీర్వదించారు.

## ఘనంగా కాంగ్రెస్ అధ్యక్షురాలు విమలదేవి జన్మదిన వేడుకలు

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



హైదర్ నగర్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు విమల దేవి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ, స్థానిక డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ లు తమ కార్యాలయాలలో శాలువా కప్పి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ మాట్లాడుతూ కష్టపడి పని చేసే స్వభావం గల నాయకురాలు విమల అని,ప్రజా సేవకురాలని కొనియాడారు. అనంతరం మహిళా నాయకులు, సన్నిహితులు,బంధువులు కేక్ కట్ చేపించి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వెలగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మహిళలు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## నల్ల చెరువు అభివృద్ధి పనులను వేకవంతంగా పూర్తి చేయండి

**కూకట్పల్లి నల్లచెరువును పరిశీలించిన ఎమ్మెల్యే కృష్ణారావు...**


**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



కూకట్పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు హైడ్రాధికారులతో వాటర్ వర్క్స్, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి బుధవారం నల్లచెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని చెరువు అభివృద్ధి కొరకు ఇప్పటికే నిధులు మంజూరైన కారణంగా త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే వర్షాలు పడినప్పుడు డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తం కాకుండా పైప్లైన్ నిర్మాణం,రిటర్నింగ్ వాల్స్ చేపట్టి దిగువకు నీరు వెళ్లే విధముగా చూడాలని అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచన చేశారు. జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులతో సమన్వయం చేసుకుని ఎక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా సత్వరమే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని యం ఎల్ ఎ కృష్ణారావు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు డి.ఈ నాగరాజు, జి.హెచ్.యం వాటర్ వర్క్స్ అధికారులు సి.సి చిన్న రెడ్డి నిఖిల్ రెడ్డి , నాగ ప్రియా, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# దేశ సేవకు జీవితాన్ని ధారపోసి భరతమాత ఒడిలో తుదిశ్వాస వదిలిన దివంగత మాజీ ప్రధాని, రాజీవ్ గాంధీ

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
సరికొత్త చరిత్రను దేశం లిఖించేలా అడుగులు వేసిన రాజీవ్ గాంధీ ఎప్పటికీ చిరస్మరణీయుడేనని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. దేశంలో సాంకేతిక విప్లవానికి పునాదులు వేసి ఆధునిక భారత్ కు బాటలు వేసిన దార్శనికులు అని కొనియాడారు. మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కెపిహెచ్ బి కాలనీ లోని రాజీవ్ సర్కిల్ దగ్గర డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరై రాజీవ్ గాంధీ విగ్రహానికి మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం విగ్రహానికి పూలమాలలు సినివాలు అర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ దేశ సేవకు జీవితాన్ని ధారపోసి భరతమాత ఒడిలో తుదిశ్వాస వదిలిన రాజీవ్ గాంధీ ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడిగా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి సమర్థవంతంగా సుస్థిరపాలన అందించిన రాజకీయ నాయకుడిగా రాజీవ్ గాంధీ చరిత్రలో నిలిచారని కొనియాడారు. రాజకీయాలంటే ఇష్టం లేకపోయినా ప్రధానమంత్రిగా చరిత్రలో నిలిచిపోయే విధంగా శాస్త్ర సాంకేతిక రంగం వృద్ధికి ఊతమిచ్చారని అన్నారు. భారతదేశానికి నూతన దిశను చూపిన మహానాయకుడు అని, 21వ శతాబ్దం భారతానికి తగిన సాంకేతికత, ఐటీ విప్లవం, యువతలో నూతన ఆశలు నూరిపోసిన వ్యక్తి రాజీవ్ గాంధీ గ్రామీణ అభివృద్ధి, విద్య, ఆరోగ్యం రంగాల్లో ఆయన దూరదృష్టితో అమలు చేసిన పథకాలు ఇవాళా కూడా దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి అన్నారు. భారత్ లో సాంకేతిక విప్లవానికి ఆరాధ్యుడైన రాజీవ్ గారి గురించి ఎంత చెప్పిన తక్కువే, ఇప్పుడు మనం ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ను అనుసరిస్తున్నామంటే అందుకు నాడు సాంకేతిక రంగానికి రాజీవ్ గాంధీ వేసిన బీజాలే కారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ కార్యదర్శి గాలి బాలాజీ, ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏఎంసి చైర్మన్ పుష్పా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేరి సతీష్ రెడ్డి, సాధు ప్రతాప్ రెడ్డి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ గోపిశెట్టి రాఘవేందర్, సంజీవ్ రావు, మేకల మైకేల్, కొండల్ రెడ్డి, తూము సంతోష్, అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అడ్డగోలుగా అక్రమ బహుళ అంతస్తులు!

## చందానగర్ సర్కిల్‌లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు

- ఎవరు ఎలా కట్టుకుంటే మాకేంటి పొయేది...
- ఓ వైపు ఆరోపణలు..మరోవైపు విమర్శలు.. - టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు మారడం లేదు.
- కానరాని అవినీతి నిరోధక శాఖ.... - ఎంత స్థలం ఉంది అని కూడా చూడరు...


మదీనాగూడ ద్వారకా నగర్ లో కృష్ణ టెంపుల్ ఎదురుగా

**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి శేరిలింగంపల్లి :**
ఓ వైపు ఆరోపణలు..మరోవైపు విమర్శలు.. అయినా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు మారడం లేదు. అధికారుల పనితీరుపై విమర్శలు గుప్పుమంటున్నా.. లైట్ తీసుకుంటున్నారు. అక్రమార్కులకు ఒత్తాసుపలుకుతూ.. అనుమతులేని నిర్మాణాలను వదిలేస్తూ జేబులు నింపేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. యధారాజ.. తధాప్రజా అన్నట్లుగా ఉన్నతాధికారుల అడుగుజాడల్లోనే కిందిస్థాయి సిబ్బంది నడుస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చందానగర్ సర్కిల్‌లోని ఓ అధికారి, కిందిస్థాయి సిబ్బందిని చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్న తీరుతో అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా బహుళ అంతస్థుల భవనాలు వెలుస్తున్నాయి. జీహెచ్ఎంసీ ఆదాయానికి గండి కొడుతూ సరైన అనుమతులు లేకున్నా విచ్చలవిడిగా నూతన భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఎవరు ఎలా కట్టుకుంటే పొయేది ఏముంది పోనీలే అని జీహెచ్ఎంసీ అధికారులు అంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఎవరికేం పోయేది లేకున్నా జీహెచ్ఎంసీ ఆదాయానికి మాత్రం భారీగా గండిపడుతోంది. హఫీజ్ పెట్ డివిజన్, చందానగర్ డివిజన్ మియాపూర్ డివిజన్ల లో అక్రమ నిర్మాణాలు.. శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఈమధ్యకాలంలో భవన నిర్మాణాలు జోరందుకున్నాయి. ఇన్నాళ్లు ఏదో ఒక కారణంతో ఆగిన నిర్మాణాలు సైతం ఇప్పుడు ఎంచక్కా పూర్తవుతున్నాయి. పర్మిషన్లు ఉన్నాయా..? లేదా..? అసలు అనుమతికోసం జీహెచ్ఎంసీలో అప్లై చేసుకున్నారా..? అనే ప్రశ్నలకే తావులేకుండా యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఆవైపు జీహెచ్ఎంసీ సిబ్బంది వెళ్లినా చూసీచూడనట్టుగా వ్యవహరించడం, అక్రమార్కులకు ఒత్తాసు పలుకుతుండడంతో ఈతరహా నిర్మాణాలకు మరింతగా ఊతమిస్తున్నట్లుగా తయారయింది. హఫీజ్ పెట్ చందానగర్ మియాపూర్ పరిధిలోని డివిజన్‌ల లో అనేక నిర్మాణాలు సాగుతున్నా పర్మిషన్లు మాత్రం కొన్నింటికే ఉన్నాయని తెలుస్తోంది. అయినా జీహెచ్ఎంసీ సిబ్బంది మాత్రం ఉలుకూపలుకు లేకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు అనగానే అధికారులు, సిబ్బందికి వెంటనే గుర్తుకు వచ్చేది అయ్యప్ప సోసైటీ తాండ గోకుల్ ప్లాట్స్. కానీ అక్కడికి మించిన కట్టడాలు, నిబంధనల ఉల్లంఘనలు హఫీజ్ పెట్, డివిజన్లో చోటుచేసుకుంటున్నాయి. అనుమతులు లేని నిర్మాణాల వల్ల జీహెచ్ఎంసీ ఆదాయానికి భారీ గండిపడుతుందని తెలిసినా ఏ లాభాపేక్ష కోసం అధికా రులు అక్రమార్కులకు వంతపాడుతున్నారో వారికే తెలియాలి. ఇలాంటి నిర్మాణాల వద్ద కిందిస్థాయి సిబ్బంది గట్టిగానే చేతులు తడుపుకుంటున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. హఫీజ్ పెట్ లో మదినగూడ శ్రీ కృష్ణ దేవాలయం ఎదురుగా ఎలాంటి అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ కట్టడాలపై, ఈ స్థలాలకు అనుమతులు ఇవ్వడంపై అంటే ఇక్కడ అధికారులు ఏరేంజ్‌లో రెచ్చిపోతున్నారో ఇట్టే అర్థం అవుతుంది.

**అక్కడ గాలి మేడలే.. వెలుస్తున్నాయి.**
డివిజన్ పరిధిలోని హఫీజ్ పెట్, మదీనాగూడ, ఆల్వేన్ కాలనీ, మైత్రి నగర్, మాతృశ్రీ నగర్, రాజారామ్ కాలనీ, వైశాలి నగర్, ప్రకాష్ నగర్, డీకే ఎంక్లేవ్, మయూరి నగర్, లక్ష్మీ నగర్, ఎక్కడ చూసినా అక్రమ భవంతులే దర్శనమిస్తున్నాయి ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు తో పాటు పలు కాలనీల్లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వీటిలో చాలావాటికి పర్మిషన్లు లేవని సమాచారం. యూఎల్‌సీలు, ఎల్ఆర్ఎస్‌లు కూడా అంతంత మాత్రమే..అయినా నిర్మాణాలు మాత్రం యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. నిర్మాణదారులు అధికారులు ఇచ్చిన అనుమతుల ప్రకారమే కట్టడాలు సాగించాలి. కానీ ఇక్కడ మాత్రం అడ్డగోలుగా నిర్మాణాలు సాగుతున్నాయి. జీ ప్లస్ 2 లేదా 3 భవంతులకు మాత్రమే పర్మిషన్ ఉంటే కొందరు బిల్డర్లు, నిర్మాణదారులు ఏకంగా సెల్లార్లు తవ్వేసి వాటిపై 6 అంతస్తుల భవనాలు నిర్మించారు. కొన్నిచోట్ల అసలు అనుమతులు లేకున్నా ఎంచక్కా కట్టేస్తున్నారు. అదీగాక పైన పెంట్ హౌస్‌లు కూడా కట్టారు.
వీటిలో ఎక్కడా కనీస నిబంధనలు కూడా పాటించలేదు. హఫీజ్ పెట్, చందానగర్, మియాపూర్ ప్రశాంత్ నగర్, లోనూ ఇదే వరస తదితర చోట్ల నిబంధనలను గాలికి వదిలేస్తూ గాలిమేడలు వెలుస్తున్నా టౌన్ ప్లానింగ్ సిబ్బంది తీసుకుంటున్న చర్యలు మాత్రం శూన్యమేనని కిందిస్థాయి సిబ్బంది ప్రోత్సాహం వల్లనే ఇలాంటి నిర్మాణాలు సాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. అయినా ఈ విషయాలు అన్నీ తెలిసినా సంబంధిత అధికారులు మిన్నకుండి చోద్యం చూస్తున్నారు. జీహెచ్ఎంసీ ఉన్నత అధికారులు చూసీచూడన్నట్టు వ్యవహరించడంతోనే ఇవన్నీ సాగునుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**వారికి నిబంధనలు వర్తించవు..**
జీహెచ్ఎంసీ పరిధిలో ఎక్కడ నిర్మాణాలు సాగించినా ఒకే రూల్ ఉంటుంది. వారు నిర్దేశించిన కొలతల ప్రకారమే నిర్మాణాలు సాగించాలి. కానీ ఈ డివిజన్‌లలో మాత్రం అవేవీ ఉండవు. ఇక్కడ కొందరు బిల్డర్లు, నిర్మాణదారులదే ఇష్టారాజ్యం. వారికి ఎంతస్థలం ఉంది, దానికి పర్మిషన్లు ఏమున్నాయి అన్న విషయాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా వారికి ఎన్ని అంతస్థులు కట్టుకోవాలి అనుకుంటే అన్ని కట్టేస్తున్నారు. పైగా పెంట్ హౌస్ ఉంటే ఖర్చుల కింద పనికి వస్తాయన్న ఆలోచనతో అక్రమ నిర్మాణాలపై పెంట్ హౌస్‌లు నిర్మిస్తున్నారు. ఇదంతా తెలిసినా జీహెచ్ఎంసీ టీపీఎస్ సిబ్బంది మాత్రం ఎందుకో చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ డివిజన్‌లో ఇష్టారాజ్యంగా షెడ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. కానీ టీపీఎస్ అధికారులు మాత్రం కొందరి విషయంలో లైట్ తీసుకుంటారన్న విమర్శలున్నాయి.

**వందల కోట్ల ఆదాయానికి గండి..**
విచ్చలవిడిగా సాగుతున్న నిర్మాణాలతో జీహెచ్ఎంసీకి భారీగా ఆదాయం చేకూరాలి, కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతోంది. సంస్థ ఆదాయానికి అధికారులే గండి కొడుతుంటే జీహెచ్ఎంసీ ఎప్పటికి కోలుకుంటుంది అన్నది శేష ప్రశ్న అనే చెప్పాలి. అనుమతులు లేకుండా, అంతకు మించి సాగుతున్న నిర్మాణాలపై అధికారులు ఇప్పటికైనా దృష్టిసారిస్తారో లేదో చూడాలి.


బికేఎన్ క్లేవ్

# ఘనంగా యువ నాయకుడు రామ్మోహన్ పుట్టినరోజు వేడుకలు..

### శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని అల్లాపూర్ డివిజన్ యువ నాయకుడు రామ్మోహన్ పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రామ్మోహన్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావునిమర్యాదపూర్వకంగా వారి కార్యాలయంలో కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం రాజేశ్వరరావు రామ్మోహన్ ను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# దేశానికి గాంధీ కుటుంబమే రక్ష...

### మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
దేశానికి గాంధీ కుటుంబమే రక్ష అని మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు పర్యవేక్షణలో రాజీవ్ సర్కిల్ వద్ద గల విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మాజీ మంత్రివర్యులు సర్వే సత్యనారాయణ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, కూకట్పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డిలు పాల్గొని ఘనంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ ముందు నుంచి కూడా గాంధీ కుటుంబమే దేశానికి రక్షగా ఉంటూ వస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాదు ప్రతాపరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, కరుణాకర్ నాయుడు, మేకల మైకల్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు నిత్యవసర వస్తువులు పంపిణీ




**తెలుగు - వెలుగు, తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):**
అనపర్తి రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హెూప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ తేతలి రామిరెడ్డి మంగాయమ్మ మహిళా వృద్ధాశ్రమంలోని వృద్దులకు కీర్తిశేషులు పడాల రామకృష్ణారెడ్డి,పడాల రామరాజు దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు పడాల వీర్రాఘవ రెడ్డి 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు,ఇతర ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. అనంతరం బుధవారం అనపర్తి ప్రాంతంలో ఉన్న అంగన్వాడి సెంటర్లో పిల్లల సౌకర్యార్థం సిలింగ్ ఫ్యాన్, చాపలు, బిస్కెట్లు రస్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు, కోస్తాంధ్ర రెడ్డి యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, వ్యవస్థాపకులు డాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
గురువారం 22-5-2025



# మళ్లీ కోవిడ్ ప్రచారం...

## – మెడికల్ మాఫియా కుట్రే !



కరోనా మళ్లీ పెరుగుతోందంటే రెండు, మూడు రోజులుగా అంతర్జాతీయ మీడియా ప్రచారం చేస్తోంది. వాటిని పట్టుకుని గుడ్డెద్దు చేలో పడినట్లుగా సోషల్ మీడియాలో కొంత మంది మళ్లీ కరోనా వస్తుందని ప్రచారం ప్రారంభించారు. ఇదిగో అన్ని కేసులు.. ఇదిగో ఇన్ని కేసులు అని అప్ డేట్స్ ప్రారంభించారు. కొత్త కొత్త వేరియంట్ల పేరుతో ప్రజల్ని గందరగోళానికి గురి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇదంతా అప్పుడప్పుడూ జరుగుతున్నదే. మెడికల్ మాఫియా డబ్బు పిండాలనుకున్నప్పుడల్లా ఇలాంటి ప్రచారం ప్రారంభమవుతుంది.

**జలుబు, జ్వరం లాంటి సాధారణ వైరస్ గా మారిన కరోనా**

కరోనా అనే దానికి మందు లేదు. పూర్తిగా జలుబు, జ్వరం లక్షణాలతో ఉంటుంది. వాటికి ఉపయోగిచే మందులతోనే తగ్గిపోంది. కానీ కరోనా వస్తే ఏదో జరిగిపోతుందన్న భయం పుట్టించి ప్రపంచాన్ని అతలాకుతలం చేశారు. అసలు కరోనా వల్ల చనిపోయిన వారి కన్నా.. కరోనా అనే భయంతో చనిపోయిన వారే ఎక్కువ. ఇతర తీవ్రమైన సమస్యలు ఉన్నప్పుడు కరోనా ప్రభావం చూపింది . తర్వాత అది బలహీనం అయింది. అది ఇప్పుడు జలుబుతో సమానంగా మారింది.కానీ కొత్త వేరియంట్ల పేరుతో ఎప్పటికప్పుడు హడావుడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

**ఏడాదికోసారి మళ్లీ కరోనా అంటూ హడావుడి**

కరోనా అనే ప్రచారం మొదట చైనా నుంచి వస్తుంది. అక్కడి ప్రజలు మాస్కులేసుకుంటున్నారని.. వందల మంది ఆస్పత్రుల్లో చనిపోతున్నారని ప్రచారం చేస్తారు. కానీ అక్కడ అంతేమీ ఉండదు. ఇప్పుడు సింగపూర్, యూరప్, అమెరికాల్లో కేసులు పెరుగుతున్నాయని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఆయా దేశాల్లో కరోనా వచ్చినప్పటి నుండి కరోనా టెస్టులు చేస్తున్నారు పాజిటివ్ వచ్చిన వారికి మామూలు ట్రీట్మెంట్ ఇస్తున్నారు. కానీ.. భయపెట్టేలా ప్రచారాలు చేసి వారి వారి ప్రజల్ని గందరగోళానికి గురి చేయడం లేదు.

**మెడికల్ మాఫియా కుట్రల్లో భాగంగానే కరోనా అలజడి !**

కరోనా పేరుతో ఒక్క సారి ప్రజల్ని భయపెడితే లక్షల కోట్ల వ్యాపారం మెడికల్ రంగంలో జరుగుతుంది. ఫేస్ మాస్కుల నుంచి వ్యాక్సిన్ల వరకూ ఈ మాఫియా విస్తరించి ఉంటుంది. ప్రజల్ని దోపిడీ చేయడమే లక్ష్యంగా సాగే ప్రచారాలతో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. అనవసర భయాందోళనలకు గురి కావడం వల్ల ఎక్కువ ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఇలాంటి వాటి కోసమే వారు చేసే ప్రచారాలు. కరోనా.. కోవిడ్ అనేది ఇప్పుడు అంత ప్రమాదకరం కాదు. కాస్త జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

### నేను కన్నడలో మాట్లాడను... హిందీలోనే మాట్లాడతా...

# బ్యాంకు మేనేజర్ తీరు వివాదాస్పదం

**కర్ణాటక ఎస్‌బీఐలో కస్టమర్‌తో కన్నడలో మాట్లాడనన్న మహిళా అధికారిణి**

**సోషల్ మీడియాలో వీడియో వైరల్, హిందీ రుద్దుతున్నారంటూ విమర్శలు**

**వెల్లువెత్తిన నిరసనలతో అధికారిణి కన్నడలో క్షమాపణ**

**ఘటనపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తీవ్ర ఆగ్రహం**

**అధికారిణి బదిలీ, బ్యాంకు సిబ్బందికి భాషా శిక్షణ ఇవ్వాలని సూచన**

కర్ణాటకలో ఓ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ వ్యవహరించిన తీరు తీవ్ర వివాదానికి దారితీసింది. స్థానిక భాష అయిన కన్నడలో మాట్లాడటానికి నిరాకరించడమే కాకుండా, కస్టమర్‌తో దురుసుగా ప్రవర్తించిన ఘటనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. సోషల్ మీడియాలో ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో, సదరు బ్యాంకు మేనేజర్ చివరకు క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. అంతేకాదు, ఆమెను ఎస్‌బీఐ అధికారులు బదిలీ చేసినట్టు తెలుస్తోంది. ఈ ఘటనపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా తీవ్రంగా స్పందించారు. అనేకల్ తాలూకాలోని సూర్య నగర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) శాఖలో ఈ సంఘటన చోటుచేసుకుంది. బ్యాంకుకు వచ్చిన ఒక కస్టమర్, అక్కడి బ్రాంచ్ మేనేజర్ ను కన్నడలో మాట్లాడాలని కోరారు. అయితే, ఆ మేనేజర్ అందుకు నిరాకరించారు. "ఇది కర్ణాటక మేడమ్, దయచేసి కన్నడలో మాట్లాడండి" అని కస్టమర్ పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ, ఆమె పెడచెవిన పెట్టారు. "ఇది ఇండియా" అంటూ బదులిచ్చిన అధికారిణి, "నేను మీ కోసం కన్నడ మాట్లాడను%ౌ% నేను హిందీలోనే మాట్లాడతాను" అని స్పష్టం చేశారు. వాగ్వాదం తీవ్రం కావడంతో, ఆ బ్రాంచ్ మేనేజర్"నేను ఎప్పటికీ కన్నడ మాట్లాడను" అని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు.ఈ సంభాషణ మొత్తాన్ని ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది క్షణాల్లో వైరల్‌గా మారింది. బ్యాంకు మేనేజర్ తీరుపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది హిందీని బలవంతంగా రుద్దడమేనని, స్థానిక భాషను అగౌరవపరచడమేనని మండిపడ్డారు. కస్టమర్లతో అమర్యాదగా ప్రవర్తించారని, ఆర్‌బీఐ మార్గదర్శకాలను కూడా పట్టించుకోలేదని ఆరోపిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ట్యాగ్ చేస్తూ పోస్టులు పెట్టారు. "కన్నడ భాషను అవమానించిన అధికారిణిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి"




అని పలువురు డిమాండ్ చేశారు. విమర్శలు వెల్లువెత్తడంతో, ఎస్‌బీఐ అధికారులు స్పందించారు. సదరు మహిళా అధికారిణి తన సహోద్యోగి సహాయంతో కన్నడలో క్షమాపణ చెబుతున్న వీడియోను విడుదల చేశారు. "నా ప్రవర్తన వల్ల ఎవరైనా బాధపడి ఉంటే, మనస్ఫూర్తిగా క్షమాపణ కోరుతున్నాను. ఇకపై కన్నడలోనే కార్యకలాపాలు నిర్వహించడానికి ప్రయత్నిస్తాను" అని ఆమె ఆ వీడియోలో పేర్కొన్నారు.

**ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్ర స్పందన**

ఈ ఘటనపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య తీవ్రంగా స్పందించారు. "అనేకల్ తాలూకా, సూర్య నగరలోని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ (అధికారిణి) కన్నడ, ఇంగ్లీషులో మాట్లాడటానికి నిరాకరించి, పౌరులను అగౌరవపరిచిన తీరు తీవ్రంగా ఖండించదగినది" అని ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వ్యాఖ్యానించారు. సదరు అధికారిణిని బదిలీ చేస్తూ ఎస్‌బీఐ తీసుకున్న చర్యను ప్రస్తావించిన సీఎం, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో ఐదు రోజులు పాటు భారీ వర్షాలు..



హైదరాబాద్: ద్రోణి ప్రభావంతో తెలంగాణలో రాగల ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.. ఉత్తర కర్నాటక-గోవా తీరాల వెంబడి తూర్పు మధ్య అరేబియా సముద్రంపై నున్న ఉపరితల ఆవర్తం నుంచి కోస్తాంధ్ర వరకు ద్రోణి సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతాలు, పరిసరాలను ఆనుకొని ఉన్న దక్షిణ తెలంగాణపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కిలో మీటర్ల విస్తరించి ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ క్రమంలో బుధవారం నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో గంటకు 30-40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు పడుతాయని తెలిపింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది. అలాగే, శుక్ర, శని, ఆదివారాల్లోనూ హైదరాబాద్ సహా ఉత్తర, దక్షిణ తెలంగాణ లోని పలు ప్రాంతాల్లో వానలు పడుతాయని వాతావరణ శాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది..

## ఘనంగా దత్తుడు శ్రీను జన్మదిన వేడుక



**తెలుగు - వెలుగు, తూ.గో. జిల్లా బ్యూరో (అనపర్తి)**

తెలుగుదేశం పార్టీ అనపర్తి మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను) జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించారు.బుధవారం అనపర్తి కుమ్మర వీధిలో టిడిపి నేతల ఆధ్వర్యంలో నిర్వహించిన దత్తుడు శ్రీను జన్మదిన వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.టిడిపి అధికారంలో ఉన్న, లేకపోయినా పక్క పార్టీ వైపు దిక్కులు చూడని, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం అయిన దత్తుడు శ్రీను కి పార్టీలో మంచి పట్టు ఉండటమే కాకుండా ప్రజల్లో అందరికీ మంచి చేసే ప్రజా నేతగా గుర్తింపు పొందారు.ఎంత ఎదిగినా ఒదిగి ఉండే లక్షణం కలిగిన నేత దత్తుడు శ్రీను.ఎవరికైనా సహాయం అందించడంలో ముందుంటారనే అభిప్రాయం అందరిలో సంపాదించుకున్న నేత దత్తుడు శ్రీను.కాగా దత్తుడు శ్రీను జన్మదిన వేడుకలో మల్లిడి ఆదినారాయణ రెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి సత్యనారాయణ రెడ్డి (పొలమూరు), కర్రి శేషారత్నం,కొవ్వూరి వెంకట రామారెడ్డి, కోస్తాంధ్ర రెడ్డి యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, తాడి గంగిరెడ్డి, కర్రి సూర్యనారాయణ రెడ్డి (సూరి),ఓగిరెడ్డి రాధ, సత్తి దేవదాన రెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి ఇంకా పెద్ద సంఖ్యలో కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పూలమాలలతో ముంచెత్తారు.

## భారీ వర్షానికి రోడ్డుపై పడిన చెట్లు

**తెలుగు వెలుగు:( ఎయిర్ గట్ల మండల్)**



నిజామాబాద్ జిల్లా భట్టాపూర్ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున రెండు గంటల తర్వాత ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో మండల కేంద్రం ఏర్గట్ల నుండి బట్టా పూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో రెండు చోట్ల రోడ్డుకు ఇరువైపున ఉన్న చెట్లు అడ్డంగా పడిపోయాయి. రోడ్డుపై పడి ఉన్న చెట్లను ఎవరు పట్టించుకోకపోవడంతో భట్టాపూర్ గ్రామానికి చెందిన యువకుడు దయానంద్ తో పాటు పలువురు యువకులు అటువైపు వెళ్తున్న ప్రయాణికులు కలిసి భట్టాపూర్ శివారులోని రోడ్డుపై పడి ఉన్న చెట్టును తొలగించి రోడ్డును క్లియర్ చేశారు ఏర్గట్ల శివారులోని భీమన్న ఆలయం సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్టును ఏర్గట్ల గ్రామపంచాయతీ కార్యదర్శి జాకీర్ తన సిబ్బందితో కలిసి రోడ్డుపై పడి ఉన్న చెట్టును తొలగించారు.

## ట్రంప్ పన్నుల ప్లాన్ మన రియల్ ఎస్టేట్ పై ఎఫెక్ట్ !



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న విచిత్రమైన ఆలోచనలతో అల్లకల్లోలం రేగుతోంది. భారత్ పై పగబట్టినట్లుగా వ్యవహరిస్తున్న ఆయన తీరు వల్ల పలు రంగాలకు నష్టం ఏర్పడుతోంది. ఇటీవల భారతీయులు అక్కడ సంపాదించుకుని ఇండియాకు పంపే మొత్తాలపై ఐదుశాతం పన్ను వేయాలన్న ఆలోన చేస్తున్నారు. ఈ మేరకు ప్రాథమికంగా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కానీ ట్రంప్ చట్టం చేస్తే భారతీయులు అక్కడ సంపాదించుకున్నందుకు కాక.. ఇక్కడకు పంపినందుకు కూడా డబ్బులు చెల్లించాలి. ప్రధానంగా అమెరికా నుంచి భారతీయులు ఇక్కడ తమ బంధువులకు పంపే మొత్తాల్లో ఎక్కువగా రియల్ ఎస్టేట్ లో పెట్టుబడులు పెడతారు. ఎవరికీ పంపకపోయినా తమ సొమ్ము ను సొంత ప్రాంతాల్లో పెట్టుబడిగా ఆస్తులు కొనడానికి ప్రాధాన్యం ఇస్తారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ లో ఎన్నారైల వాటా నలభై శాతానికిపైగా ఉంటుందని అంటారు. ముఖ్యంగా లగ్జరీ ప్రాజెక్టులన్నీ ఎన్నారైల మీదనే ఆధారపడి ఉన్నాయి ఈ క్రమంలో ట్రంప్ నగదు ట్రాన్స్ ఫర్ చేసుకోవడంపై పన్నులు విధిస్తే .. అక్కడి నుంచి డబ్బులు పంపించేవారు.. పెట్టుబడులు పెట్టేవారు తగ్గే అవకాశం ఉంది. ఇది హైదరాబాద్ తో పాటు ఏపీ రియల్ ఎస్టేట్ కు ఇబ్బందికరంగా మారుతుంది. ఈ విధానం అమెరికా రాజ్యాంగం ప్రకారం అమల్లోకి రాదని ఎక్కువ మంది అనుకుంటున్నారు. కానీ ట్రంప్ భారత్ పై గురి పెట్టారు. సినిమాలపై వంద శాతం పన్ను వేస్తామంటున్నారు. ఇప్పుడు అమెరికా నుంచి నగదు రాకుండా చేయాలని చూస్తున్నారు.

## సజ్జలకు బిగ్ షాక్



వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డికి ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చింది. కడప జిల్లా సీకే దిన్నె మండలంలో సజ్జల ఫ్యామిలీ ఆక్రమించిన 55 ఎకరాల అటవీ భూమిని స్వాధీనం చేసుకుంటున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కలెక్టర్ రిపోర్ట్ ఆధారంగా సర్కార్ ఈ చర్యలు తీసుకుంది. రేపు ఈ భూములను అధికారులు స్వాధీనం చేసుకుంటారని సమాచారం. కాగా ఈ ప్రాంతంలో సజ్జల కుటుంబసభ్యులకు దాదాపు 146 ఎకరాల భూమి ఉన్నట్లు తెలుస్తోంది.

## నక్సలిజంపై బలగాల విజయం గర్వకారణం: మోదీ

ఛత్తీస్గఢ్ భారీ ఎన్కౌంటర్పై ప్రధాని మోదీ స్పందించారు. భద్రతాబలగాల



విజయం గర్వకారణమని ట్వీట్ చేశారు. దేశంలో ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు నక్సలిజం నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన వెల్లడించారు. కాగా ఇవాళ ఛత్తీస్గఢ్లోని నారాయణపూర్–బీజాపూర్ మధ్య ఉన్న ఇంద్రావతి అభయారణ్యంలో జరిగిన భీకర ఎన్ కౌంటర్లో 27 మంది నక్సల్స్ మరణించారు.

## భయపెట్టి పాలించాలనుకుంటున్నారు...

**మద్యం కుంభకోణం జరగలేదు: మిథున్ రెడ్డి.**

**ఏపీలో అరాచక పాలన సాగుతోందన్న ఎంపీ మిథున్ రెడ్డి**

**ఇంటింటికీ రేషన్ వాహనాల రద్దు సరికాదని వ్యాఖ్య**

**సంక్షేమ పథకాలు ఆపారని ఆగ్రహం**




ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వ పాలనపై వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి పరిపాలించాలనుకోవడం అవివేకమని ఆయన మండిపడ్డారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగిన పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జ్ల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ తీరును తప్పుబడుతూ మిథున్ రెడ్డి పలు కీలక ఆరోపణలు చేశారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నిలిపివేయడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, ప్రజల దృష్టిని మరల్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వాహనాలను రద్దు చేయడం సరైన చర్య కాదని హితవు పలికారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి మద్యం కుంభకోణం జరగలేదని మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కట్టుకథలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, మద్యం కుంభకోణం జరిగిందంటూ దుష్ప్రచారం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న ప్రచారమేనని కొట్టిపారేశారు. అనంతపురం జిల్లాలో గ్రామీణాభివృద్ధికి సేవలందిస్తున్న రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సంస్థకు అందే విదేశీ నిధులను నిలిపివేయడం దుర్మార్గమైన చర్య అని మిథున్ రెడ్డి అన్నారు. దీనివల్ల ఎంతోమంది పేదలకు అందే సాయం ఆగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు లైనింగ్ పనుల విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన సూచించారు. ఈ పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తగవని అభిప్రాయపడ్డారు.

## ఇంత పెద్ద నేత చనిపోవడం ఇదే తొలిసారి..

**మావోయిస్టు అగ్రనేత కేశవరావు మృతిపై అమిత్ షా ట్వీట్**



ఛత్తీస్గఢ్లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎన్కౌంటర్లో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. బుధవారం జరిగిన ఎన్కౌంటర్లో మొత్తం 27 మంది మావోయిస్టులు మృతిచెంది నట్లు తెలిపారు. ఈ 27 మందిలో అగ్రనేత నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారని వెల్లడించారు. కేశవరావుపై రూ. 1.5కోట్లు రివార్డు ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అమిత్ షా మరో కీలక ప్రకటన చేశారు. 2026 మార్చి 31వ తేదీ నాటికి దేశంలోనే మావోయిస్టులు అనే వారే లేకుండా చేస్తామని తెలిపారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ ద్వారా ఇప్పటివరకు 84 మంది మావోయిస్టులు లొంగిపోయారని, 50 మందికి పైగా అరెస్ట్ చేశామని చెప్పారు. మావోయిస్టు పార్టీ ఉద్యమానికి నంబాళ్ల కేశవరావు వెన్నెముకగా ఉన్నారని చెప్పారు. ప్రధాన కార్యదర్శి స్థాయి నేత మరణించడం 30 ఏళ్లలో ఇదే తొలిసారి అని అన్నారు. ఎలాగైనా అంతమొందించాలనే లక్ష్యంతోనే ముందడుగు వేశామని వెల్లడించారు.

# అంగారకుడి నుంచి మనుషులను తెస్తారు...

**మీరు మృతదేహాలను తీసుకురాలేరా?: రేవంత్ సర్కార్ పై కేటీఆర్ ఫైర్**

**ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదానికి మూడు నెలలు పూర్తి**

**ఆరుగురు కార్మికుల మృతదేహాలు ఇంకా గల్లంతు**

**ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం**



శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్బీసీ) సొరంగం ప్రమాదం జరిగి మూడు నెలలు కావస్తున్నా, అందులో చిక్కుకుపోయిన కార్మికుల మృతదేహాలను వెలికితీయడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారుపై ఆయన ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఎస్ఎల్బీసీ సొరంగం నిర్మాణంలో ప్రమాదం చోటుచేసుకుని, ఎనిమిది మంది కార్మికులు లోపల చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. వీరిలో ఇద్దరి మృతదేహాలను మాత్రమే వెలికితీయగలిగారు. మిగిలిన ఆరుగురి ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. సుమారు 58 రోజుల పాటు సహాయక చర్యలు కొనసాగించినప్పటికీ, ఫలితం లేకపోవడంతో ప్రభుత్వం వాటిని తాత్కాలికంగా నిలిపివేసింది. దీంతో, మిగిలిన కార్మికుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ ఘటనపై కేటీఆర్ తాజాగా స్పందిస్తూ, "సమర్థవంతమైన నాయకత్వం ఉంటే మూడు నెలల్లో అంగారక గ్రహం నుంచి మనుషులను తీసుకురావొచ్చు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సొరంగంలో చిక్కుకున్న మృతదేహాలను కూడా బయటకు తీసుకురాలేకపోయింది. రేవంత్ రెడ్డి గారూ, మీకు సిగ్గుగా లేదా?" అంటూ తన ట్వీట్లో ఘాటుగా ప్రశ్నించారు. ప్రమాదం జరిగి మూడు నెలలు గడిచినా, మృతదేహాలను వెలికితీయకపోవడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. బాధిత కుటుంబాలను ఇప్పటివరకు పరామర్శించకపోవడం, వారికి అండగా నిలవకపోవడం సీఎం రేవంత్ రెడ్డికి మానవత్వం లేదనడానికి నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. తక్షణమే బాధిత కుటుంబాలను కలిసి, వారికి క్షమాపణ చెప్పి, ప్రభుత్వ సాయం అందించాలని డిమాండ్ చేశారు. "ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిసినా, కేవలం కమిషన్ల కోసమే కుటుంబాలను బలిచేశారు" అని కూడా ఆయన ఆరోపించారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

**విశాఖలో 5 లక్షల మందితో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు!**

**రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది భాగస్వామ్యం అయ్యేలా చూడాలి**

**26 జిల్లాల్లో 26 రోజుల పాటు యోగాభ్యసన కార్యక్రమాలు**

**సెలబ్రిటీలతో యోగా డే**

**విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో మంత్రుల బృందం సమీక్ష**

**26 రోజుల కేలండర్ ను రూపొందించాలని అధికారులకు ఆదేశం**





ఉండవల్లి: విశాఖలో వచ్చే నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతుండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల బృందం అధికారులకు దిశానిర్దేశం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఉండవల్లి నివాసంలో అధికారులతో మంత్రుల బృందం సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. యోగా ప్రధాని నరేంద్ర మోదీ గారి మనసకు దగ్గరైన కార్యక్రమం. రాష్ట్రాభివృద్ధికి మోదీ గారు ఎంతగానో అండగా నిలుస్తున్నారు. విశాఖలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించుకునే అవకాశం రాష్ట్రానికి దక్కింది. అన్ని శాఖలు సమన్వయంతో కార్యక్రమం విజయవంతానికి కృషిచేయాలి. రేపటి నుంచి నెల రోజుల పాటు యోగా కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందుకు మొదటి మూడు రోజులు ప్రజలను సన్నద్ధం చేయాలన్నారు.

**26 జిల్లాల్లో 26 రోజుల పాటు రోజుకో జిల్లాలో వినూత్న యోగాభ్యసన కార్యక్రమం**

యోగాంధ్రలో భాగంగా 26 జిల్లాల్లో 26 రోజుల పాటు రాష్ట్ర కార్యక్రమం కింద రోజుకో జిల్లాలో 5వేల మందితో వినూత్నంగా యోగాభ్యసన కార్యక్రమాలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని మంత్రుల బృందం అధికారులను ఆదేశించింది. ఇందులో యువత, మహిళలు, సీనియర్ సిటిజన్స్, పోలీసులు, దివ్యాంగులు, ఉద్యోగులు వంటి వివిధ విభాగాలను భాగస్వామ్యం చేయాలి. ఈ కార్యక్రమాల్లో పాల్గొనే వారికి ధృవపత్రాలు ఇవ్వాలి. 26 జిల్లాల్లో 26 రోజుల పాటు జరిగే యోగా కార్యక్రమాలపై కేలండర్ ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సెలబ్రిటీలను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రధాన పట్టణాలు, నగరాల్లో యోగభ్యసన కార్యక్రమాలు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో 100 పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో వెయ్యి మందితో యోగా డే నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది భాగస్వామ్యం అయ్యేలా చూడాలి**

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది భాగస్వామ్యం అయ్యేలా చూడాలని మంత్రుల బృందం అధికారులకు దిశానిర్దేశం చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా యోగా దినోత్సవంలో పాల్గొనే వారి నుంచి రిజిస్ట్రేషన్లు తీసుకోవాలి. ప్రజలను సంసిద్ధం చేయాలి. విశాఖలో 5 లక్షల మందితో అంతర్జాతీయ యోగదినోత్సవం నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రుల బృందం ఆదేశించింది. యోగాపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, సోషల్ మీడియా క్యాంపెయిన్ చేపట్టాలని సూచించింది. యోగాంధ్ర లోగోపైనా సమావేశంలో చర్చించారు. విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రుల బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, హోంమంత్రి వంగలపూడి అనిత, సాంఘిక సంక్షేమశాఖ మంత్ర డోలా బాలవీరాంజనేయస్వామి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, యోగా డే నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబు, ఇతర ఉన్నతాధికారులు అజయ్ జైన్, శశిభూషణ్, ముకేష్ కుమార్ మీనా, సురేష్ కుమార్, కోన శశిధర్, వినయ్ చంద్, వీరపాండ్యన్, హిమాంశు శుక్లా, దినేష్ కుమార్, ప్రకాష్ జైన్, విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంక బ్రతా బాగ్చీ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ వ్యవస్థలో తిమింగలాలు...

**జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్కు ఎన్నాళ్లు?**

**అంతర్గత విచారణలో పారదర్శకత ఏదీ?**

**నివేదికను బయట పెట్టాలి :ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ఖడ్**




న్యూఢిల్లీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ఖడ్ మరోసారి న్యాయవ్యవస్థ మీద విరుచుకుపడ్డారు. అధికార నివాసంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు దాచారని ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ మీద ఎందుకు ఇంతవరకు పోలీస్ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ప్రశ్నించారు. ముగ్గురు న్యాయమూర్తులతో జరిపించిన విచారణకు ఎలాంటి చట్టబద్ధతా లేదని వ్యాఖ్యానించారు. దేశంలోని ప్రతి ఒక్కరూ ఈ కేసులో ఎలాంటి చర్యలూ లేకుండా మూసేస్తారని భావిస్తున్నారని చెప్పారు. సోమవారం రాత్రి ఆయన ఢిల్లీలో ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. "మన ముందు ఒక చేదు నిజం నిలబడింది. ఢిల్లీలోని ఒక న్యాయమూర్తి అధికార నివాసంలో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. మార్చిలో జరిగితే ఇంతవరకు ఎఫ్ఐఆర్ లేదు. దీన్ని కూడా కాలక్రమంలో మరచిపోవాల్సి వస్తుందని జనం అనుకుంటున్నారు. ఇతర పౌరుల విషయంలో జరిగినట్లుగా నేర న్యాయ వ్యవస్థ న్యాయమూర్తుల విషయంలో ఎందుకు పని చేయడం లేదు? ఆ డబ్బులు ఎవరివి? ఎక్కడి నుంచి వచ్చాయి? లాంటి వివరాల కోసం జనం ఎదురు చూస్తున్నారు" అన్నారు. న్యాయ వ్యవస్థ కలుషితం అయ్యిందని, వర్మ కన్నా పెద్ద తిమింగలాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఇప్పటివరకు సరిగానే వ్యవహరించిందని, ముగ్గురు న్యాయమూర్తుల కమిటీని వేయడం ద్వారా మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడారని చెప్పారు. జస్టిస్ గవాయ్ జస్టిస్ ఖన్నా బాటలో నడవవాలని, నివేదికను బహిర్గతం చేయాలని సూచించారు. న్యాయమూర్తుల మీద ఆరోపణలు వచ్చినపుడు అంతర్గత విచారణ జరిపే సంప్రదాయానికి జస్టిస్ వెంకటస్వామి కేసులో 1991 నాటి సుప్రీంకోర్టు తీర్పు అవకాశం ఇచ్చిందని ధన్ఖడ్ చెప్పారు. ఆ తీర్పును పునస్సమీక్షించాలని డిమాండ్ చేశారు. నాటి తీర్పుతో న్యాయవ్యవస్థలో జవాబుదారీతనానికి, పారదర్శకతకు పాతర వేసినట్లు అయ్యిందని వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని దేవెగౌడతో సమావేశమైన ధన్ఖడ్ రైతులకు ఇచ్చే అన్ని రకాల సబ్సిడీలు నగదు రూపంలో బ్యాంకు ఖాతాల్లో వేయాలని అభిప్రాయపడ్డారు. ఇతర ఏ రకాలుగా ఇచ్చినా కొంత లంచాలకు పోతుందని వ్యాఖ్యానించారు.

# ఆరో రోజూ.. అదే జోరు..కాళేశ్వరంలో కిటకిటలాడుతున్న సరస్వతీ పుష్కర ఘాట్లు.!!



యశంకర్ భూపాలపల్లి/మహదేవ్‌పూర్, కాళేశ్వరంలోని సరస్వతీ పుష్కర ఘాట్లు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పుష్కరాల్లో ఆరోరోజైన మంగళవారం సైతం తెలంగాణతో పాటు ఏపీ, చత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, కర్నాటక నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయాన్నే కాళేశ్వరానికి చేరుకున్న భక్తులు 'కాళేశ్వరస్య స్మరణం సర్వపాప వినాశనం' అంటూ త్రివేణి సంగమంలో పుష్కర స్నానమాచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన చర్యలను ఎప్పటికప్పుడు ఆఫీసర్లు పర్యవేక్షిస్తున్నారు. మరో వైపు సరస్వతి పుష్కరాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సరస్వతీ నవరత్నమాల హారతి ఘట్టాన్ని ప్రతీరోజు ప్రత్యక్ష ప్రసారం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుమారు అరగంట పాటు సాగే సరస్వతీ నవరత్నమాల హారతిలో తొమ్మిది ప్రత్యేక హారతులు ఇస్తారు.

# నోటీసులపై ఏం చేద్దాం..కేసీఆర్ తో హరీష్ ఏం చర్చించారంటే?

అలా కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇచ్చిందో లేదో, ఫామ్ హౌజ్ లో కేసీఆర్ తో భేటీ అయి సమాలోచనలు మొదలు పెట్టారు హరీష్ రావు. అసలు విచారణకు వెళ్లాలా? లేదంటే నోటీసులపై కోర్టును ఆశ్రయించాలా? అని చర్చించారు. అయితే, కాళేశ్వరం తమ మానసపుత్రిక అని చెప్పుకొని , ఇప్పుడు ఆ ప్రాజెక్టు వ్యవహారంలో వచ్చిన నోటీసులపై కోర్టును ఆశ్రయిస్తే కేసీఆర్ పై జనాల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. అందుకే ఈ విషయంలో మధ్యేమార్గంగా వ్యవహరించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాళేశ్వరం కమిషన్ ఎదుట ఇప్పటివరకు హాజరైన అధికారులు దాదాపు పైనుంచి అందిన ఆదేశాలతోనే ప్రాజెక్టు డిజైన్ జరిగిందని, కేసీఆరే ఆదేశాల మేరకు నడుచుకున్నామని చెప్పినట్లుగా సమాచారం. దాంతో ఈ వ్యవహారంలో న్యాయనిపుణులతో చర్చించి విచారణకు హాజరు కావాలా? లేదంటే మరికొంత సమయం ఇవ్వాలని కోరాలా ? అనేది తర్వాత నిర్ణయిద్దామని హరీష్ తో కేసీఆర్ అన్నట్లుగా తెలుస్తోంది. ఈమేరకు ఫామ్ హౌజ్ లో కేసీఆర్ న్యాయనిపుణులతో భేటీ అయి విచారణకు హాజరయ్యే అంశంపై చర్చించనున్నారు. కాళేశ్వరం కమిషన్ ముందు కేసీఆర్ హాజరు అవుతేనే బాగుంటుంది అనేది మెజార్టీ అభిప్రాయం. కానీ, కేసీఆర్ మాత్రం ఆ దిశగా ఆలోచించడం లేదని బీఆర్ఎస్ వర్గాల్లో జరుగుతోన్న ప్రచారం. కాళేశ్వరంను బీఆర్ఎస్ ఇప్పటికీ క్లెయిం చేసుకుంటుడంతో దాన్ని అలాగే కొనసాగించాలని అనుకుంటే తప్పనిసరిగా విచారణకు హాజరు కావాల్సిందే. అందుకే



విచారణకు హాజరై..నిబంధనల మేరకే ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని , ప్రమాదవశాత్తు భూమిలోకి ఇసుక వెళ్లడంతో ఘటన జరిగిందని చెబితే కేసీఆర్ కు రిస్క్ ఉండదని నిపుణుల అభిప్రాయం.దీంతో కేసీఆర్ ఈ విషయంలో న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే, హరీష్ రావు మాత్రం న్యాయనిపుణుల సలహాలతో తప్పనిసరిగా విచారణకు హాజరు అవ్వనున్నట్టు తెలుస్తోంది.

# స్కాంలో స్కీమ్: 1000 కిలోల బంగారం కొన్న మద్యం మాఫియా...



ఏపీ లిక్కర్ స్కామ్ లో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. తీగ లాగితే డొంక అంతా కదిలినట్లుగా ఒక్కొక్కటిగా బయటకు వస్తోన్న విషయాలు నోరెళ్ళబెట్టేలా చేస్తున్నాయి. ఇప్పటికే స్కామ్ నగదుతో జగన్ సన్నిహితులు 1000కోట్లతో బెంగళూరులో రియల్ ఎస్టేట్ బిజినెస్ నడిపించారనే విషయం బయటకు రాగా.. ఊహించని విధంగా బంగారం కూడా భారీ ఎత్తున కొనుగోలు చేసినట్లుగా తెలుస్తోంది. ఫేక్ మద్యం కంపెనీలు సృష్టించి ఆ కంపెనీ అధిపతులు భారీగా బంగారం కొనుగోలు చేసినట్లుగా తెలుస్తోంది. మొదట 400కిలోల బంగారం కొనుగోలు చేశారనుకున్నా.. అది వెయ్యి కిలోల వరకు ఉండొచ్చునని ప్రచారం జరుగుతోంది. బంగారం వ్యాపారం అధికంగా జరిగే ముంబై మార్కెట్ , తిలక్ నగర్ ఇండస్ట్రీస్ నుంచి 200కోట్ల విలువైన బంగారం కొనుగోలు చేసినట్లుగా సిట్ గుర్తించింది. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా ఉండేలా మిగతాది ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసినట్లుగా గుర్తించారు. బంగారం కొనుగోలు చేసిన తర్వాత మద్యం కంపెనీల అధినేతలు %ా% రాజ్ కేసిరెడ్డి బృందానికి పంపేవారని తెలుస్తోంది. ఆ బంగారం విదేశాలకు పంపి , నగదుగా మార్చి దాన్ని రియల్ ఎస్టేట్ , సినిమా రంగాల్లో పెట్టుబడి పెట్టినట్లుగా తెలుస్తోంది. ఎవరెవరు బంగారం కొనుగోలు చేసి, రాజ్ కేసిరెడ్డి బృందానికి పంపారు? ఆ బంగారాన్ని విదేశాలకు ఎలా పంపారు? ఇందుకోసం రాజ్ కేసిరెడ్డికి ఎవరెవరు తోడ్పాటు అందించారు?అనే విషయాలపై సిట్ ప్రస్తుతం ఫోకస్ పెట్టింది.మరోవైపు ఈ కేసులో మనీ లాండరింగ్ జరిగిందని భావిస్తున్న ఈడీ.. నిందితుల విచారణకు అనుమతి కోరింది. అనుమతి రాగానే ఈ కేసులో నగదు లావాదేవీలు, బంగారం కొనుగోలు వంటి వాటిపై ఫుల్ ఫోకస్ పెట్టబోతోంది.

# పులివెందులపై టిడిపి స్పెషల్ ఫోకస్?

**అమరావతి:మే 21**




ప్రతిపక్ష నేత సొంత జిల్లాలో పసుపు జెండాలు రెపరెపలాడాల్సిందే..విపక్ష నేత సొంత ఇలాకాలో మనబలమేంటో చూపించా ల్సిందే. ఆపోజిషన్ లీడర్ నట్టింట్లో సైకిల్ పవర్ ఏంటో సత్తా చాటాల్సిందే. ఇదీ టీడీపీ అధినేత అసలు వ్యూహమా? కడప మహానాడులో బాబు బిగ్ గీసిన స్కెచ్ ఒక్కొక్కటిగా బయటపడుతు న్నాయా? ఇంతకీ కూటమి అధి నేత..విపక్ష నేత ఇలాకాలో వేసిన పొలిటికల్ స్కెచ్చేం టి? మహానాడు మ్యాని యలో ఏం జరగబోతోంది? వైయస్సార్సీపి పార్టీ అధినేత వైఎస్ జగన్ సొంత జిల్లా కడప గడపలో అడుగుపెట్టి తన సత్తా చాటిన టీడీపీ..ఇప్పుడు ఏకంగా తన నియోజకవర్గం పులివెందులలో అడుగు పెట్టి ఆ పార్టీ పునాదులు లేకుండా చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు రాజ కీయ వ్యూహాలకు మరింత పదును పెడుతున్నారట. దీంతో కడప జిల్లా రాజకీ యాలు ఒక్కసారిగా వేడెక్కాయన్న టాక్ రాజకీయవర్గాల్లో విన్పిస్తోం ది.జగన్ సొంత నియోజ కవర్గం పులివెందులలో ఇప్పుడు టీడీపీ రీసౌండ్ చేస్తుందన్న వార్తలు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిగ్గా మారాయి. ఎందుకంటే వైఎస్సార్ అంటే పులివెం దుల, పులివెందుల అంటే వైఎస్సార్ అన్న పేరు నేటికీ అక్కడ కొనసాగుతోంది. కానీ తాజా పరిస్థితులు అందుకు భిన్నంగా మారు తున్నాయనే చర్చ జిల్లా రాజకీయాల్లో నడుస్తోంది. 4 దశాబ్దాలుగా వైఎస్ ఫ్యామిలీ కంట్రోల్ లో నడుస్తున్న పులివెందులలో ఇప్పుడు పరిస్థితి కాస్త చేంజ్ కనబడుతోంది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికా రంలో ఉన్నా పులివెందుల ప్రజలు మాత్రం వైఎస్ ఫ్యామిలీ వెంటే నడిచారు. వైఎస్ వివేకానంద రెడ్డి మొదలుకొని వైఎస్సార్, వైఎస్ జగన్, వైఎస్ అవినాష్ రెడ్డి కేవలం వైఎస్ ఫ్యామిలీని సపోర్ట్ చేస్తున్న జనం ఇప్పుడు ఒక్కసారిగా మార్పుకోసం చూస్తున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. వైఎస్ వివేకా మృతి తర్వాత పులివెందు లలో చాలా మార్పులు వచ్చాయట. ఆయన మరణం తర్వాత వైసీపీ ఏపీలో అధికారాన్ని కోల్పోయింది. వైఎస్ వివేక మరణం తర్వాత కడప జిల్లాలోనే కాదు..జగన్ సొంత నియో జకవర్గం పులివెందుల ప్రజల్లో కూడా మార్పు మొదలైందట. మార్పు కావాలంటూ కోరుకుంటున్న జనం ఆ దిశగా అడుగులు వేస్తున్నారట. సరిగ్గా ఇదే అవకాశాన్ని అందిపుచ్చు కున్న కూటమి పులివెందు లపై స్పెషల్ ఫోకస్ పెంచిందట. కూటమి సర్కార్.. జగన్ సొంత ఇలాకాలో ఫ్యాన్ పార్టీని దెబ్బకొట్టి సైకిల్ పవర్ ఏంటో చూపించాలన్న ఆలోచనతో టీడీపీ అధినేత చంద్రబాబు సరికొత్త పొలిటికల్ స్కెచ్ వేశారని సమాచారం. 2019 ఎన్నికల్లో అధికా రంలోకి వచ్చిన జగన్ టీడీపీ అధినేత చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో తన పవర్ చూపించాడు. ఇప్పుడు చంద్రబాబు కూడా అలాంటి మైండ్ గేమ్ నే మొదలు పెట్టి పులివెం దులపై ఫోకస్ పెట్టారట. ఇప్పటికే పులివెందుల నుంచి ఎమ్మెల్సీని గెలిపిం చుకొని ఉపుమీదున్న పార్టీలోకి మరింత మంది లీడర్లను కడప వేదికగా ఆహ్వానించడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పులివెందుల మున్సిపాలిటీలో ఇద్దరు కౌన్సిలర్లు పార్టీ మార గా..మరికొంతమంది కూడా అదే దారిలో ఉన్నట్లు టాక్ విన్పిస్తోంది.

## జూలైలో స్థానిక సంస్థల ఎన్నికలు!

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణంలో సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలకు ఎన్నికలపై స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. జూలైలో లోకల్ ఎలక్షన్స్ నిర్వహించే అవకాశం ఉందని చెప్పినట్లు సమా చారం. ప్రస్తుతం పార్లమెంట్ నియోజ కవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ సమావేశమవుతున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్షిస్తున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచిస్తున్నారు.



## 2026 మార్చి 31లోపు నక్సలిజం అంతం: అమిత్ షా..



వచ్చే ఏడాది మార్చి 31లోపు నక్సలిజాన్ని అంతం చేయాలని సంకల్పించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ట్వీట్ చేశారు. 'ఛత్తీస్ గఢ్ లో భద్రత దళాలు ఇవాళ 27 మంది మావోలను మట్టుబెట్టాయి. వీరిలో - మావోయిస్టు జనరల్ సెక్రటరీ కేశవరావు కూడా ఉన్నాడు. గత మూడు దశాబ్దాల కాలంలో ఇంత పెద్ద నేతను చంపడం ఇదే తొలిసారి. ఛత్తీస్గఢ్, % లో మొత్తం 54 మంది నక్సల్స్ అరెస్ట్ అయ్యారు. 84 మంది లొంగిపోయారు' అని పేర్కొన్నారు.

## కర్నూలు-విజయవాడ మధ్య విమాన సర్వీసులు



**విజయవాడ :** ఏపీ రాష్ట్ర రాజధాని అమరావతి, కర్నూలు మధ్య జులై 2వ తేదీ నుంచి విమాన సర్వీసులు ప్రారంభించబోతున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్నాయుడు ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో ఈ రెండు నగరాల మధ్య విమాన రాకపోకలు ఉంటాయి. ఈ విమాన సేవల ద్వారా రాష్ట్రంలో అంతర్గతంగా కనెక్టివిటీ పెరుగుతుంది. 'అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు.

## బంగారం చోరీ అవడంతో మనస్తాపానికి గురై రెండున్నరేళ్ల కుమారుడితో బిల్డింగ్ పైనుండి దూకిన తల్లి




హైదరాబాద్ - చింతల్‌కుంటకు చెందిన సుధేష్ణ (28) ఈ నెల 16న బంధువుల శుభకార్యానికి వెళ్లగా, తన ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి అవి దొరకకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుధేష్ణ.. తన రెండున్నరేళ్ల కుమారుడు ఆరుష్ కుమార్‌తో పాటు మూడో అంతస్తు నుంచి కిందకు దూకింది ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుధేష్ణ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా.. బాబు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు

## మహిళా కమిషన్ చైర్ పర్సన్ శైలజ రాయపాటి ఆకస్మిక తనిఖీలు



ఏపీ మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ గుంటూరులోని శక్తి సదన్, సఖీ వన్ స్టాప్ సెంటర్, బాలల పరిరక్షణ విభాగం, గృహ హింస నిరోధక విభాగం, ఎన్టీఆర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లను ఆకస్మికంగా పరిశీలించారు. శక్తి సదన్‌లో ఉండే బాధిత మహిళలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర నిధులతో మహిళలకు ఉపాధి అవకాశాలు, అవసరమైన సహాయాలు అందిస్తున్నామని తెలిపారు. గత వైసీపీ పాలనలో దిశా చట్టం పేరుతో మహిళలను మోసం చేశారని, కేంద్రం నిధులు మంజూరు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బాధితులు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో మహిళల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తామని, రాజధాని మహిళ రైతులపై జరిగిన దాడులపై త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## శంషాబాద్లో విమానానికి తప్పిన ప్రమాదం




శంషాబాద్ ఎయిర్ పోర్టు నుండి ఫ్రాంక్ ఫోర్ట్ వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక లోపం ఏర్పడింది. రన్వే మీదకు వెళ్లిన వెంటనే విమానం ముందు టైరులో సాంకేతిక సమస్య కనిపించింది. సమస్యను గుర్తించిన పైలట్ వెంటనే విమానాన్ని తిరిగి మళ్లించారు. దీంతో, పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో 190 మంది ప్రయాణీకులు ఉన్నారు. పైలట్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది.

# నాకు మైండ్ బ్లాంక్ అవుతోంది: జగన్ షాకింగ్ కామెంట్స్

“ఏంటబ్బా ఈ కేసులు.. ఒకదాని తర్వాత.. ఒకటా.? కనీసం బెయిల్ కూడా దక్కకుండా చేస్తున్నారే. ఇవన్నీ చూస్తుంటే.. నాకు మైండ్ బ్లాంక్ అవుతోంది. అయినా.. ధైర్యంగానే ఉందాం. ప్రజలే అన్నీ చూసుకుంటారు. బాబు పాపాలు పండినప్పుడు ప్రజలే బుద్ధి చెబుతారు. మీరు ఎక్కడా నిరుత్సాహ పడకండి. నాలాగే ధైర్యంగా ఉండండి%-% అని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సహజంగా జగన్ నుంచి నోటీ నుంచిమైండ్ బ్లాంక్%-% అనే మాట వస్తుందని ఎవరూ ఊహించరు. అనేక సమస్యలు వచ్చినా.. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందన్నా.. నిమ్మకు నీరెత్తినట్టునిదానంగా వ్యవహరించడం .. ఆయన పేటెంట్ అని పార్టీ నాయకులే చెబుతారు. అలాంటిది తాజాగా జగన్.. తన మైండ్ బ్లాంక్ అవుతోందంటూ సంచలనం వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, సహా .. మద్యం కేసులో వరుస పెట్టి జరిగిన అరెస్టులు, జైళ్లకు పంపడాలతో జగన్ ఒకింత షాక్‌కు గురైనట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన ఎవరూ ఊహించనివిధంగా కామెంట్లు చేశారని తెలుస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. కాగా.. మంగళవారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో కోనసీమ జిల్లా రామచంద్రాపురం మున్సిపాలిటీ, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మున్సిపాలిటీ, శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) కార్పొరేటర్లు, వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జగన్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జగన్ తొలుత పైవిధంగా వ్యాఖ్యానించారు. అనంతరం.. ఆయా జిల్లాలకు సంబంధించిన పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని టీడీపీ హయాంలో ఏ ఒక్క



పంటకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. తమ హయాంలో ట్రైబల్ ప్రాంతాలను అభివృద్ధి చేశామని అన్నారు. టీడీపీ హయాంలో భోగాపురం ఎయిర్పోర్ట్ లో భూసేకరణ జరగలేదన్నారు. వైస్సార్సీపీ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి జరగిందన్నారు. రాష్టంలోని అన్ని వ్యవస్థ లను చంద్రబాబు నిర్వీర్యం చేసారని మండిపడ్డారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. అయినా.. ధైర్యం కోల్పోకుండా.. పార్టీ కోసం పనిచేయాలని సూచించారు.

# బాబు ఢిల్లీ టూర్ జగన్ అరెస్టు కోసమేనా?



టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం దేశ రాజధాని ఢిల్లీ పర్యటనకు వెళుతున్నారు. గురువారం రాత్రి నుంచి మొదలు కానున్న ఆయన హస్తిన టూర్ శుక్ర, శనివారాల్లో కూడా కొనసాగనుంది. ఈ టూర్ లో చంద్రబాబు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో ఓ కీలక భేటీ నిర్వహించనున్నారు. శుక్రవారం జరగనున్న ఈ భేటీలో ఏపీకి సంబంధించి ఓ కీలక పరిణామానికి కేంద్రం నుంచి చంద్రబాబు అనుమతి తీసుకుంటారన్న దిశగా విశ్లేషణలు సాగుతున్నాయి. మద్యం కుంభకోణంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అరెస్టు, తదనంతర పరిణామాలపైనే ఈ భేటీలో కీలక చర్చ జరగనున్నట్లు సమాచారం. వైసీపీ హయాంలో మద్యం వ్యాపారం మొత్తం ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగగా%ౌ%అందులో పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయంటూ ఆరోపణలు వచ్చాయి. వాటిపై కూటమి సర్కారు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి మరీ విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ విచారణలో కుంభకోణంలో కీలక భూమిక పోషించిన వారందరినీ దాదాపుగా సిట్ అరెస్టు చేసింది. వీరిలో కీలక నిందితులు అయిన కసిరెడ్డి రాజశేఖరరెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డిలను సిట్ అదికారులు కస్టడీలోకి తీసుకుని విచారించింది. ఈ విచారణతో పాటు ఇతర నిందితుల విచారణలోనూ అన్ని వేళ్లూ జగన్ వైపే చూపుతున్నట్లుగా సిట్ గుర్తించింది. మద్యం కుంభకోణం ముడుపుల అంతిమ లబ్ధిదారు జగనేనని కూడా నిందితులు చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జగన్ అరెస్టు తప్పదన్న వాదనలు అంతకంతకూ పెరిగపోగా%ౌ%వైసీపీ శ్రేణులు కూడా జగన్ అరెస్టు తప్పదని దాదాపుగా ఓ అంచనాకు వచ్చాయి. అదే సమయంలో మంగళవారం నాటి కేబినెట్ సమావేశంలోనూ చంద్రబాబు మద్యం కుంభకోణంపై కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రులెవ్వరూ దీనిపై బయట మాట్లాడవద్దని, అనవసర రాద్ధాంతం తీసుకురావద్దని సూచించారు. ఈ వ్యాఖ్యలతోనే జగన్ అరెస్టుకు రంగం సిద్ధమైపోయినట్టు విశ్లేషణలు వెలువడ్డాయి. ఓ మాజీ సీఎం, ఓ పార్టీ అదినేతగా ఉన్న జగన్ ను అరెస్టు చేయాలంటే కేంద్రానికి మాటమాత్రంగా అయినా చెప్పాలి కదా. అందులోనూ కేంద్రంలోనూ కూటమి సర్కారే కొలువుదీరి ఉంది. ఈ క్రమంలోనే ఢిల్లీ టూర్ ప్లాన్ చేసుకున్న చంద్రబాబు.. షెడ్యూల్డ్ నీతి ఆయోగ్ సమావేశానికంటే ముందుగానే అమిత్ షాతో భేటీ కావాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం ఉదయం అమిత్ షాతో భేటీ కానున్న చంద్రబాబు..మద్యం కుంభకోణానికి సంబంధించిన సమగ్ర వివరాలను ఆయన ముందుపెట్టనున్నారు. అంతేకాకుండా మద్యం కుంభకోణంలో ప్రభుత్వ ధనంతో పాటు ప్రజారోగ్యాన్ని జగన్ అండ్ కో ఏ రీతిన నిర్వీర్యం చేశారన్న విషయాన్ని కూడా అమిత్ షాకు వివరించనున్నారు. మద్యం ముడుపులన్నీ తాడేపల్లి ప్యాలెస్ కే చేరినట్టుగా పక్కా ఆధారాలను కూడా ఆయన షా ముందు పెట్టనున్నట్టు సమాచారం. వెరసి జగన్ అరెస్టు కోసం అమిత్ షా నుంచి అనుమతి తీసుకోవడమే ఈ దఫా చంద్రబాబు టూర్ ముఖ్య ఉద్దేశ్యమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట.

# అలిపిరి పేలుడు సూత్రదారి నంబాల హతం

టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుపై 20 ఏళ్ల క్రితం తిరుపతి సమీపంలోని అలిపిరిలో హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. మనం ఇప్పుడు మావోయిస్టులుగా పిలుచుకుంటున్న నాటి నక్సలైట్లు ఈ దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో బుల్లెట్ ప్రూఫ్ కారులో ప్రయాణిస్తున్న చంద్రబాబు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. అప్పటికే 9 ఏళ్ల పాటు ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా పనిచేసిన బాబు%ౌ% ఆ తర్వాత అప్రహతిహతంగా తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఏపీకి మరోమారు సీఎంగా పనిచేస్తున్నారు. నాడు కలియుగ దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వెళుతున్న చంద్రబాబుపై నక్సలైట్లు క్లైమోర్ మైన్లు పెట్టి పేల్చారు. ఈ దాడికి నాటి నక్సల్స్ ఉద్యమంలో గెరిల్లా పోరాటానికి నాందీ పలికిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు అలియాస్ గంగన్న తాజాగా బుధవారం ఛత్తీస్ గఢ్ లో జరిగిన ఎన్ కౌంటర్ లో హతమైపోయాడు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన నంబాల%ౌ% వరంగల్ లోని ఇప్పటి ఎన్ఐటీ%ౌ% నాటి ఆర్ఈసీలో ఇంజినీరింగ్ చదివి ఆ తర్వాత నేరుగా నక్సల్స్ ఉద్యమంలోకి ఎంట్రీ ఇచ్చేశాడు. ఎంట్రీ ఇవ్వడంతోనే గెరిల్లా పోరాటాలకు తెర లేపిన నంబాల కీలక రాజకీయ నేతలను టార్గెట్ చేస్తూ సాగాడు. దండకారణ్యంలో కీలక భూమిక పోషించిన నంబాల%ౌ% మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆపరేషన్ కగార్ పేరిట కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు మావోయిస్టులను సమూలంగా ఏరివేసేందుకు భారీ ఆపరేషన్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్ లో ఇప్పటికే మావోయిస్టులకు పెద్ద ఎత్తున దెబ్బలు తగలగా%ౌ%తాజాగా బుధవారం చత్తీస్ గఢ్ లోని నారాయణపూర్ జిల్లా అడవుల్లో జరిగిన ఎన్



కౌంటర్ లో 26 మంది మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో నంబాల కూడా ఉన్నట్లు పోలీసులు చెప్పారు. చంద్రబాబుపై హత్యాయత్నంతో పాటుగా బలిమెల వంటి కీలక ఆపరేషన్లు కూడా నంబాల నేతృత్వంలోనే జరిగినట్లు సమాచారం. ఇక రాష్ట్ర విభజన జరిగిన తర్వాత విశాఖ జిల్లా పరిధిలో నాటి టీడీపీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావుతో పాటు మాజీ ఎమ్మెల్యే సివేరీ సోమలను కూడా మావోయిస్టులు హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ హత్యలకు కూడా నంబాలనే వ్యూహకర్తగా వ్యవహరించారట. మావోయిస్టుల ప్రస్థానంలో కీలక భూమిక పోషించడంతో పాటుగా నక్సల్స్ పేరును మావోయిస్టులుగా మార్చే ప్రక్రియలోనూ నంబాలది కీలక భూమికే. నంబాలపై రూ.1.5 కోట్ల మేర రివార్డు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

## త్వరలో విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్!

ప్రయాణ సమయం తొమ్మిది గంటలుగా రైల్వే శాఖ ప్రాథమికంగా నిర్ణయించింది. ఇది కార్యరూపం దాలిస్తే దాదాపు మూడు గంటల ప్రయాణ సమయం ఆదా కానుంది. ఈ రైలు బెంగళూరు వెళ్లేవారితో పాటు తిరుపతి వెళ్లే భక్తులకూ ఉపయోగపడనుంది. మొత్తం 8 బోగీల్లో 7 ఏసీ చైర్కార్, ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్కార్. మంగళవారం మినహా వారానికి ఆరు రోజులు నడిచే ఈ రైలు (20711) విజయవాడలో 5.15 గంటలకు బయలుదేరి తెనాలి 5.39, ఒంగోలు 6.28, నెల్లూరు 7.43, తిరుపతి 9.45, చిత్తూరు 10.27, కాట్పాడి 11.13, కృష్ణరాజపురం 13.38, ఎస్ఎంవీటీ బెంగళూరు బెంగళూరు 14.15 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో అదే రోజు ఈ రైలు (20712) బెంగళూరులో 14.45 గంటలకు ప్రారంభమై కృష్ణరాజ పురం 14.58, కాట్పాడి 17.23, చిత్తూరు 17.49, తిరుపతి 18.55, నెల్లూరు 20.18, ఒంగోలు 21.29, తెనాలి 22.42, విజయవాడ 23.45 గంటలకు వస్తుంది. ప్రస్తుతం విజయవాడ నుంచి బెంగుళూరు వెళ్లే వారికి వారానికి 3 రోజులు నడిచే మచిలీపట్నం నుంచి యశ్వంతపూర్ వెళ్లే కొండవీడు ఎక్స్ప్రెస్ మాత్రమే అందుబాటులో ఉంది.

## ఉత్తమ్ కుమార్ రెడ్డి హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రయాణిస్తోన్న హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండ్ అయింది. వాతావరణంలో మార్పులు, గాలి వాన నేఫథ్యంలో వాతావరణ సూచన మేరకు కోదాడలో ల్యాండ్ చేశారు. కాగా మంత్రి ఉత్తమ్ హుజూర్ నగర్ మండలం మేళ్లచెరువుకు వెళ్లాల్సి ఉండగా ఈ ఇలా జరిగింది.

## ఉత్తరాఖండ్‌లో విరిగిపడ్డ కొండచరియలు

**సహాయక చర్యలు చేపట్టిన బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్**

**ఐదేళ్ల తర్వాత ఇటీవల మొదలైన యాత్ర**




కైలాస మానస సరోవర్ యాత్రీకులు మార్గమధ్యలో చిక్కుకుపోయారు. యాత్ర మార్గంలో కొండచరియలు విరిగిపడడంతో రోడ్డు బ్లాక్ అయిందని, యాత్రీకులు ముందుకు వెళ్లే పరిస్థితి లేదని అధికారులు తెలిపారు. దాదాపు 180 మంది యాత్రీకులు చిక్కుకుపోయారని చెప్పారు. అయితే, ఈ ఘటనలో యాత్రీకులు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పారు. సమాచారం అందుకున్న బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ సిబ్బంది రంగంలోకి దిగి రోడ్డును క్లియర్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్లపై పడిపోయిన శిథిలాలను తొలగిస్తున్నట్లు చెప్పారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని పితోరాగఢ్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. 2020లో కరోనా మహమ్మారి కారణంగా కైలాస మానస సరోవర్ యాత్రను అధికారులు నిలిపివేశారు. కరోనా తగ్గినప్పటికీ గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల కారణంగా భారత్, చైనా దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినడంతో ఈ యాత్రను పునరుద్ధరించలేదు. ఇటీవల ఇరు దేశాల మధ్య జరిగిన చర్చల ఫలితంగా మానస సరోవర్ యాత్రను ఐదేళ్ల తర్వాత ఈ ఏడాదే తిరిగి ప్రారంభించారు.

## మదర్సాల సిలబస్లో ‘ఆపరేషన్ సిందూర్’



ఉత్తరాఖండ్ మదర్సాల సిలబస్లో ‘ఆపరేషన్ సిందూర్’ ఉంటుందని ఆ రాష్ట్ర మదర్సా విద్యా బోర్డు ఛైర్మన్ ముఫీ షామున్ ఖాస్మి ప్రకటించారు. %ప్రా% సిందూర్ ఆవశ్యకత, సైనిక విజయాలు, దేశ భద్రత గురించి విద్యార్థులు తెలుసుకోవాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అమాయకుల ప్రాణాలు తీసినందుకు ఉగ్రవాదులకు బుద్ధి చెప్పాలన్నారు. పహల్గామ్ ఉగ్రవాదులు దాడికి ఒడిగట్టడం ఖురాన్ను తక్కువ చేయడమేనని ఆయన వ్యాఖ్యానించారు.

## ఘనంగా ఎజాజ్ వివాహ వేడుకలు

**హాజరైన పలువురు ప్రముఖులు**

**జర్నలిస్ట్ కేపీ, జమ్రుత్ ఖాన్, మిట్టు నాయక్ తదితరులు**



షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం ఇన్ముల్ నర్వ గ్రామానికి చెందిన ఎజాజ్ వివాహ వలిమా సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ కే.పి, కాంగ్రెస్ మైనార్టీ జమ్రత్ ఖాన్ తదితర మిత్ర బృందం హాజరైంది. షాద్ నగర్ పట్టణంలోని రెడ్ రోజ్ ఫంక్షన్ హాల్ లో జరిగిన వలీమా వేడుకలకు పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెళ్లి కుమారుడు ఎజాజ్ ను కలిసి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మిత్ర బృందం మధురాపురం ఎంపీటీసీ భార్గవ్ కుమార్ రెడ్డి, రషిద్ భాయ్, మిట్టు నాయక్, కొత్తపేట ఉస్మాన్, పాటిగడ్డ శేఖర్ రెడ్డి, రాజేందర్ సింగ్, వీర్లపల్లి సాజిత్, టీఎన్జీవోస్ నాయకులు వెంకట్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
గురువారం 22-5-2025



## మేడిపండు చందంగా

# చిత్రపరిశ్రమ !

హైదరాబాద్ :




చిత్ర పరిశ్రమ..అది దేశంలో ఏభాషలో అయినా కావచ్చు..ఆడవాళ్లను లొంగదీసుకోకుండా నడిచిన దాఖలాలు లేవు. చిత్రపరిశ్రమలోకి ఉత్సాహంగా వచ్చిన మగువలను మృగాళు ..వదలడం లేదు. అక్కడ విలువలు మృగ్యం. మగ పెత్తనమే ఎక్కువ. ఆడవాళ్లంటే నీచాతినీచంగా వ్యవహరిస్తున్న ఘటనలు ఎన్నో చూశాం. ఓ రకంగా సమాజంలో మగసామ్రాజ్యం ఎక్కడైనా ఉందంటే అది చిత్ర పరిశ్రమ అని చెప్పక తప్పదు. ఇలీవల మాలీవుడ్ అంటే..మళయాలంలో కాస్టకౌచింగ్ దుమారం రేపింది. కేరళలో జస్టిస్ హేమ కమిటీ నివేదిక తర్వాత ఒక్కసారిగా అగ్నిపర్వతం బద్ధలయ్యింది. అక్కడ జరుగుతున్న దారుణాలు బయటపడ్డాయి. నీతి వాక్యాలు వల్లించే వారి బండారం బయటపడింది. అమ్మ కమిటీకి మోహన్ లాల్ రాజీనామా చేశారు. వాడుకోవడం ...వదిలేయడం చిత్రపరిశ్రమలో షరామూమూలు అన్న ప్రచారం ఉండనే ఉంది. ఈ క్రమంలో వివిధ సినీ కమిటీల బాధ్యులు లైంగిక వేధింపుల, దాడుల ఆరోపణలని ఎదుర్కొని రాజీనామా చేశారు. కొంతమందిపై కేసులు నమోదయ్యాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ చిత్ర పరిశ్రమలోని స్త్రీల పని పరిస్థితులు బాగుచెయ్యటానికి అనేక కొత్త సూచనలు చేస్తున్నారు. ప్రభుత్వం విధిలేని పరిస్థితిలో కార్యాచరణకు పూనుకుంది. ఇదే క్రమంలో నటీమణులు ఒక్కొక్కరుగా తమకు జరిగిన అనుభవాలను, బాధలను బయటపెడుతున్నారు. నిజానికి ఆడవాళ్లు ధైర్యం చేసి చిత్రపరిశ్రమలోకి రాకుంటే...విర్రవీగుతున్న మగాళ్లు ఏమవుతారు. ఆడవేశాలు కూడా వారే వేసుకుంటారా అన్నది ఆలోచన చేయాలి. స్త్రీలు భీష్మించుకుని చిత్రరంగంలోకి రాకుంటే ..డ్రామా కంపెనీల్లాగా చిత్రపరిశరమ దుర్గతిని ఎదుర్కోక తప్పదు. నీతి వాక్యాలు వల్లిచే హీరోలు, నిర్మాతలు, దర్శకులు దీనిపై ఆలోచన చేయాలి. చిత్రపరిశ్రమను ఆదర్శం గా నిలపడానికి కృషి చేయాలి. పని స్థలాల్లో స్త్రీల లైంగిక వేధింపుల గురించి తెలుగు సమాజాల్లో జరుగుతున్న చర్చ దేశంలో ఇతర చోట్ల జరుగుతున్న చర్చలకి పూర్తి వ్యతిరేకంగా ఉంది. బెంగాల్‌లో ఆర్‌జి కార్ ఆస్పత్రిలో జరిగిన ఘటన తర్వాత ఆ రాష్ట్రంలో హింసా సంస్కృతి గురించే కాకుండా, పని స్థలాల్లో లైంగిక వేధింపులు, దాడుల్ని సమర్ధించే సంస్కృతి గురించి అందరూ మాట్లాడుతున్నారు. వాటిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఎంతోమంది వాదిస్తున్నారు. అయితే ఎన్ని ఘటనలు జరుగుతున్న..కుక్కతోక వంకర అన్న చందంగా మన దగ్గర మాత్రం ఇలాంటి చర్చలు జరగటం లేదు. పరిశ్రమలో ఆడవాళ్ళ పని పరిస్థితుల గురించి అస్సలు ఎవ్వరూ మాట్లాడటంట్లేదు. వారిని తోటివారుగా గౌరవించడం లేదు. ఇలా తమిళనాడు, బాలీవుడ్, ఒక్కటేమిటి అన్ని భాషల్లోనూ చిత్రపరిశ్రమలోకి రావాలనుకున్న...వచ్చిన మహిళలు వివక్షను, వేధింపులను ఎదుర్కొంటున్నారు. నిజానికి పనిప్రదేశాల్లో అన్ని చోట్లా ఇదే దుస్థితి ఉంది. కాకపోతే చిత్రపరిశ్రమలో కాస్తా ఎక్కువగా ఉంటుందని చర్చించుకోవాల్సి వస్తోంది. తెలుగు సినిమా పరిశ్రమలో పేరున్న డాన్స్ మాస్టర్ జానీ మీద అతని అసిస్టెంట్ దాఖలు చేసిన లైంగిక వేధింపులు, దాడికి సంబంధించిన ఫిర్యాదు గురించిన చర్చ ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో వందలాది మందిని కదిలించింది. అయ్యో జానీ మాస్టార్ అంటూ నీతులు వల్లిస్తున్నారు. ఆ అమ్మాయి సొంతంగా బతుకీడుద్దామనుకుంటున్న తరుణంలో కూడా వేధింపులకు పాల్పడ్డ జానీ తీరును ఖచ్చితంగా ఎండగట్టాల్సిందే. ఆమె ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడే ..ఎందుకు ఫిర్యాదు చేసింది..ఇన్నాళ్లూ ఇష్టంతోనే అతడితో ఉంది కదా? ఆమెను ఎవరు వాడుకుంటున్నారు. అతని పట్ల అసూయతోనే ఈ ఫిర్యాదు చేయించారు అంటూ నస పెడుతున్న వారు నిజాలు ఆలోచన చేయాలి. ఇటువంటి వాదనలతో నిజాలను పక్కదారి పట్టించలేరు. సోషల్ మీడియా ఇదే వాస్తవమన్న అభిప్రాయాన్ని కలుగచేస్తోంది. తెలుగు సినిమా పెద్దలు కూడా నేరం రుజువయితేనే అతని మీద చర్యలు తీసుకోవాలి అంటూ ఆయనకి పరోక్షంగా మద్దతు కూడగడుతున్నారు. జానీ మాస్టర్ అలా చేయడని కొందరు వంతపాడుతున్నారు. ఎవరు ఎలాంటి వారన్నది ఇలా ఆరోపణలు యటకు వచ్చినప్పుడే కదా తెలిసేది. 2018లో శ్రీరెడ్డి, ఇతర కళాకారులు తెలుగు సినీ పరిశ్రమలోని పురుషాధిపత్య సంస్కృతినీ, లైంగిక దాడీనీ తమ నిరసనల ద్వారా అందరి ముందుకీ తెచ్చారు. అప్పుడు ఆమెను వెక్కిరించినవారు, ఈసడించుకున్న వారే ఎక్కువ. డ్రగ్స్‌తో పట్టుబడ్డప్పుడు కూడా ఇలాగే వాదిస్తున్నారు. కానీ నిజాలను ఒపపుకోరు. తమకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకుని బతుకుతున్నారు. దాని జోలకి ఎవరూ రావద్దని వారు కోరుకుంటున్నారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో ఉన్న పరిస్థితి ప్రకారం కొత్తవాళ్ళకి పని చేసే అవకాశం రావాలన్నా, లేక అసోసియేషన్ కార్డు పొందాలన్నా కోఆర్డినేటర్లపైనా, పైనున్న మగ మాస్టార్లపైనా ఆధార పడాలి. వారికి లొంగి ఉంటేనే అసలు పనిచేసే అవకాశాలు వస్తాయి. పరిశ్రమ వారి మాటే వింటుంది. అందుకే జానీమాస్టర్ లాంటి వారు దీనిని అలుసుగా తీసుకుని లొంగగదీసుకుంటున్నారని అర్థం అవుతోంది.తనకంటే 20ఏళ్ళు చిన్నదైన అమ్మాయి, అదీ మైనారిటీ తీరని వయసులో ఉన్న అమ్మాయి పట్ల ఓ మాస్టర్ వ్యవహరించిన తీరుపైన చర్చించాలి. పరిశ్రమలో నిలబడడానికి వచ్చిన జూనియర్‌ను ప్రోత్సహించాల్సింది పోయి..బ్లాక్‌మెయిల్ చేసి కామవాంఛ తీర్చుకునే దగుల్బాజీలను ఎండగట్టాల్సిందే. సినిమా పరిశ్రమలో అత్యధిక శాతం తనకి మద్దతు ఇవ్వదని, వ్యతిరేకంగా మాట్లాడతారని తెలిసి కూడా ఆమె ఫిర్యాదుకు వచ్చిందంటే జానీ మాస్టర్ ఆమెను ఎంత తీవ్రంగా నియంత్రిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఆమెతో పాటు పని చేసే డాన్సర్లు, ఇతర సంఘాల్లో ఉండే అనేక మంది స్త్రీలు, ఇంకా చెప్పాలంటే పరిశ్రమలో దాదాపు అందరు స్త్రీలు కూడా ఇటువంటి పరిస్థితిలోనే ఉన్నారని మనం అనుకోవచ్చు. వాళ్ళు చెయ్యలేని ధైర్యం ఆమె చేసినందుకు అభినందించాలి. మాలీవుడ్ లాగా టాలీవుడ్‌లోనూ జస్టిస్ హేమ కమిటీ లాంటిది రావాలేమో. అలాంటి పరిస్థితి తెచ్చుకునే దాకా తెలుగు పరిశ్రమ రాకుండా ఉంటే మంచిది. పరిశ్రమలో ఉన్న సినీ దిగ్గజాలు ఈ దుస్థితిపై చర్చించాలి. పరిశ్రమ గౌరవాన్ని కాపాడాలి. తమకు చెడ్డపేరు రాకుండా చూసుకోవాలి. నిజానికి చెప్పాలంటే ఇలాంటి దుస్థితి అన్ని పరిశ్రమల్లో ఉంది. ఎక్కడ ఉన్నా దానిని ఎదరించాల్సిందే. నిలదీయాల్సిందే. సమర్థించే వారిని నిగ్గదీయాల్సిందే. అప్పుడే భయం అన్నది పుట్టుకుని వస్తుంది.

## డీలిమిటేషన్ అన్యాయాలపై

# చర్చ మొదలవ్వాలి !

హైదరాబాద్ :



దేశ జనాభాకు అనుగుణంగా పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు ఎప్పుడో పెరగాల్సి ఉంది. కానీ ఈ సీట్లు పెరగడం లేదు. సరికదా కేంద్రంలో పాలన చేసిన పార్టీలన్నీ కాలయాపన చేస్తూ వచ్చాయి. సీట్లు పెరిగితే తమకు ఎక్కడ ముప్పు వస్తుందో అన్న ఆలోచనలో పాలక పార్టీలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన కత్తి మీద సాములాంటిది. ఇది ఎన్నో కీలక రాజకీయ పరిణామాలకు దారి తీసే అవకాశం ఉంది. దీనికితోడు జనాభా కూడా పాపం పెరిగినట్లు పెరుగుతోంది. జనాభా కంట్రోల్ చేయడంలో కొన్ని రాష్ట్రాలు బాగా కృషి చేస్తుంటే..బీహార్, బెంగాల్ వంటి రాష్ట్రాలు అస్సలు పట్టించుకోవడం లేదు. అంతెందుకు గణాంకాల ప్రకారం ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ పట్టించుకోలేదు. దక్షిణాదిలో జనాభా నియంత్రణ కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి. ఈ క్రమంలో అక్కడ డీలిమిటేషన్ జరిగితే అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని ఇతర రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా నియంత్రణలో కృషి చేస్తున్న తమకు అన్యాయం జరిగేలా ఉందని ఇటీవల తెలంగాణ మంత్రి కెటిఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాకుండా దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల పంపిణీలో అన్యాయం జరుగుతుందని కూడా అన్నారు. నిజంగానే ఇది ఆలోచించాల్సిన విషయం. కేరళ లాంటి రాష్ట్రాలు అక్షరాస్యత,జనాభా నియంత్రణలో ముందున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే దేశ జనాభా 140 కోట్లకు చేరినందున వారికి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహించే వారి సంఖ్య కూడా పెరగాలని కోరుకుంటున్నారు. అందుకే జనాభా ప్రాతిపదికన విభజించి 846 నియోజకవర్గాలు చేయాలన్న ఆలోచన ఉంది. అలా చేస్తే.. ఒక్క యూపీకే 143 లోక్ సభ సీట్లు వస్తాయి. మొత్తం దక్షిణాదికి 160 వరకూలోక్ సభ సీట్లు ఉంటాయి. అంటే... మొత్తం దక్షిణాది అంతాకూడా యూపీతో పోటీపడదన్న మాట. దీంతో పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాబల్యం తగ్గిపోవడం ఖాయం అన్న ఆందోళన మరోవైపు వెన్నాడుతోంది. అందుకే దక్షిణాది రాష్ట్రాలు నియోజకవర్గాల పునర్వి భజనకు జనాభాను ప్రాతిపదికగా తీసుకోకూడదని డిమాండ్ చేస్తున్నాయి. దేశంలో జనాభాను నియంత్రిం చడంలోనే కాకుండా మానవ అభివృద్ధి సూచికల్లో కూడా దక్షిణాది రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి. జనాభా లెక్కల ఆధారంగా చేసే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కత్తి దక్షిణాది రాష్ట్రాలపై వేలాడుతోంది. మహిళా రిజర్వేషన్‌బిల్లు ఆమోదించిన తరువాత జరిగే తొలి జనగణన తరువాత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి.. మహిళా రిజర్వేషన్‌లను అమలు జరుపుతామని లోక్‌సభలో కేంద్రం ప్రకటించింది. దీంతో.. మళ్లీ నియోజక వర్గాల పునర్విభజన అంశం తెరమీదకు వచ్చింది. జనాభానే ప్రాతిపదికగా తీసుకుంటే దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గే ప్రమాదం ఉందని ఇప్పటికే అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఎంపీ స్థానాలకు 1971 నాటి జనగణన ప్రాతిపదిక. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలకు ప్రస్తుతం 129 లోక్‌సభ స్థానాలున్నాయి. జనాభా లెక్కలు తీసిన తర్వాత పునర్విభజనలో వీటి సంఖ్య 103కు పడిపోతుంది. ఉత్తరాదిలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్ రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య పెరుగుతుంది. ప్రస్తుతం ఈ నాలుగు రాష్ట్రాల్లోని లోక్‌సభ స్థానాల సంఖ్య 174 కాగా పునర్విభజనతో వీటి సంఖ్య ఏకంగా 204 స్థానాలకు చేరుకుంటుంది. పశ్చిమబెంగాల్, ఒడిషా కూడా భారీగా నష్టపోతాయి. ప్రసుతం ఈ రెండు రాష్ట్రాలకు కలిపి 42 లోక్‌సభ స్థానాలుంటే.. కొత్తగా జరిగే పునర్విభజన తరువాత వాటి సంఖ్య 34కు పడిపోయే అవకాశం ఉంది. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు జరిపినందుకు దక్షిణాది రాష్ట్రాలు దారుణంగా నష్టపోతుండగా.. జనాభా నియంత్రణలో పూర్తిగా విఫల మై.. జనభా విస్ఫోటంతో నానా అవస్థలు పడుతున్న ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం లబ్ధి పొందడం దారుణం కాకా మరోటి కాదు. ఇదే విషయాన్ని కెటిఆర్ లెక్కలతో సహా విరించి..జరుగబోతున్న నష్టాన్ని ప్రజల ముందుంచారు. దక్షిణాది రాష్ట్రాల నేతలు కూడా ఇదే విషయంపై మండిపడుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు కేవలం జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకూడదని ఈ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కేటీఆర్ కూడా ఇదే తరహా అభిప్రాయం వ్యక్తం చేశారు. అందుకే నియోజకవర్గాల పునర్విభజ నలో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లదని హామీ ఇవ్వాలంటూ తమిళనాడు సిఎం స్టాలిన్ ప్రధాని మోడీని డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల బిల్లును తీసుకు వచ్చిన సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన తరవాత అమలు చేయడం అని అందులో షరతు పెట్టింది. దీంతో ఈ నియోజకవర్గాల పునర్విభజన తెరపైకి వచ్చింది. ఇదే జరిగితే దక్షిణాది పరిస్థితి ఏమిటన్నదానిపై చర్చలు ప్రారంభమయ్యాయి. దేశంలో జనాభా పెరిగిపోతోందని జనాభా నియంత్రణను మన ప్రభుత్వాలు చేపట్టాయి. జనాభాను నియంత్రించిన వారికి ప్రోత్సాహకాలు ప్రకటించారు. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు మెరుగ్గా ఉన్నాయి. ప్రజలు చిన్న కుటుంబాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఫలితంగా దక్షిణాదిలో జనాభా పెరుగుదల నిష్పత్తి తగ్గింది. అభివృద్ధిలో ముందుకు వెళ్లింది. కానీ ఉత్తరాదిలో జనాభా పెరుగుదల నిష్పత్తి తగ్గలేదు... అక్కడి ప్రజలు జనాభా నియంత్రణ పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు జనాభా ప్రకారం డీలిమిటేషన్ జరిగితే.. నష్టపోయేది దక్షిణాది. లాభపడేది ఉత్తరాది. ఈ అన్యాయన్ని ఎలా సరిచేస్తారన్నదే ఇప్పుడు దేశం ముందున్న ప్రశ్న.

# పరస్పర విమర్శలకే నేతల ప్రాధాన్యం

హైదరాబాద్ :

ఎన్నికల్లో అన్ని అంశాలు పక్కకు పోతున్నాయి. దూషణల పర్వం విపరీతంగా ముందుకు పోతోంది. ఎంత ఎక్కువగా దూషిస్తే అంతగా పాపులారిటీ అన్న పంథాలో పార్టీలు, వాటి నేతలుముందుకు సాగుతున్నారు. రాజకీయాల్లో ఇలాంటి అవాంఛనీయ వ్యవహారాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రధాని మోడీ సైతం ఇదే పంథాలు సాగుతున్నారు. ఎపిలో జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పరస్పర దూషణలు చేసుకోవడంతోనే ప్రచారాన్ని హైటెల్ చేస్తున్నారు. తెలంగాణలో కూడా ఇదే తరహా పరిస్థితి ఉంది. అధికార కాంగ్రెస్, విపక్ష బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు పదేపదే విమర్శలతో కాలం గడుపుతున్నారు. సవాళ్లు విసరుతున్నారు. నిజానికి ప్రజలకు ఇవన్నీ అవసరం లేదు. ఏం చేస్తారో చెప్పాలి. ఏం చేశామో చెప్పాలి. ఎపినే తీసుకుంటే..రాష్ట్ర విభజన తరువాత 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం మిగిలిన అంశాలను విస్మరించి కేవలం రాజధాని భూముల సమీకరణ, సింగపూర్ నమూనా తదితర అంశాలకే పరిమితమైంది. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ఆలోచనలు చేయలేదు. 2019-2024 మధ్య పాలించిన వై.యస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కేవలం 'బటన్ నొక్కుడు' పరిమితమై మిగిలిన అన్ని అంశాలను నిర్లక్ష్యం చేసింది. మౌలిక వసతులలో భాగంగా కనీసం రోడ్ల నిర్మాణం కూడ చేయలేదు. టిడిపి-జనసేన కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో అభివృద్ధికి అవసరమైన అంశాలను తాము విస్మరించిన తీరును ప్రజలు గుర్తించకుండా ఉండటానికే ఎన్నికల ప్రచారంలో పరస్పర దూషణలు, వ్యక్తిగత దూషణలు చేసుకుంటున్నాయి. అభివృద్ధి అంశాలను ప్రస్తావించకుండా కేవలం సంక్షేమ అంశాలకే పరిమితమైనారు. అభివృద్ధి- సంక్షేమాన్ని సమతుల్యం చేయాలనే ఉద్దేశం మూడు ప్రాంతీయ పార్టీలకు లేకపోగా, మూడు పార్టీలు కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి అంటకాగటంపైనే దృష్టి సారించారు. మోడీ ముందు మోకరిల్లే రాజీకాయలకు పరిమితం అయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి స్పష్టమైన విధానాలు ప్రకటించలేక పోతున్నారు. మూడు ప్రాంతీయ పార్టీలు విస్మరించిన అంశాలపై వాటిని నిలదీయాల్సిన అవసరముంది.సాధారణంగా ప్రాంతీయ పార్టీలు ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షల నుంచి ఉద్భవించి, తమ రాష్ట్ర ప్రయోజనాల సాధన కోసం పోటీ పడతాయి. తెలుగుదేశం పార్టీ 1982లో 'ఆంధ్రుల ఆత్మగౌరవం' నినాదంతో ఏర్పడింది. ఉమ్మడి ఎపిలో పార్టీ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ జీవితాంతం అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన అందించారు. కానీ పదవీచ్యుడుతు కావడంతో ఆయన ప్రతిభ పోయింది. చంద్రబాబు హయాంలో కొంత అభివృద్ది సాగింది. కానీ జగన్ పాలనలో విడివడ్డ ఎపి అప్పులకుప్పగా మారింది. తెలంగాణలో కెసిఆర్ అభివృద్ధి ముసుగేసి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసింది. 1980వ దశకంలో శ్రీమతి ఇందిరా గాంధీ నాయకత్వానగల కేందప్రభుత్వ ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా ఎన్.టి.రామారావు, జ్యోతిబసు, రామకృష్ణ హెగ్డే, మొదలగు నాయకులు సమావేశాలు జరిపి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో మార్పు తెచ్చి, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఇచ్చేలా సర్కారియా కమిషన్‌ను నియమించిన సంగతి తెలిసిందే. మోడీ అధికారంలోకి వచ్చాక నీతి ఆయోగ్ ఏర్పాటు చేశారు. ప్రణాళికా సంఘాన్ని తొలగించారు. కానీ రాష్ట్రాలకు చేయూతనిచ్చి అభివృద్దిలో భాగస్వామ్యం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇకపోతే తాజా ఎన్నికల్లో కూడా అభివృద్ధి నినాదం వెనక్కి పోయింది. మూడు ప్రాంతీయ పార్టీల అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలను విస్మరించాయి. గత పదేళ్లుగా ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ, పోలవరం నిర్మాణం మొదలగు అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి, పోరాడి హక్కులను సాధించుకోవడానికి బదులు కేంద్రానికి సాగిలబడ్డాయి. భావితరాలకు అన్యాయం చేసేవిధంగా మూడు ప్రాంతీయ పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోలలో ఈ అంశాలు కనిపించలేదు. ప్రత్యేక హోదా గురించి మూడు ప్రాంతీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలలో చేర్చలేదు.ప్రత్యేక హోదా వలన రాష్ట్రంలో పారిశ్రామిక రాయితీలు, పన్ను రాయితీలు లభించి పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంది. ప్రత్యేక హోదా కోసం గత దశాబ్ద కాలంలో అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ వాటిని అణచివేయడానికే ప్రయత్నించారు. ఒక్కసారి కూడా ప్రత్యేక హోదాపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించటానికి ప్రయత్నించలేదు. ఎన్నికల మ్యానిఫెస్టోలలో ప్రత్యేక హోదాను విస్మరించటం శోచనీయం.త దశాబ్ద కాలంలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరగలేదు. మూడు ప్రాంతీయ పార్టీలకు పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పనపై స్పష్టమైన దృక్పథం లేదు. రాష్ట్రంలో ఐ.టి రంగం, ఫార్మా రంగం, టెక్స్‌టైల్స్, వ్యవసాయాధారిత పరిశ్రమల అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. విశాఖపట్నంతో పాటు తిరుపతి, అనంతపురం, ప్రకాశం జిల్లాలో దొనకొండ, గన్నవరం తదితర ప్రాంతాలను పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. నిరుద్యోగులకు ప్రభుత్వ శాఖలలో ఖాళీగా వున్న ఉద్యోగాలతో పాటు, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయటం ద్వారా ఉపాధి కల్పించాలి. పెద్ద సంఖ్యలో ఉన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులరైజేషన్‌తో ఉద్యోగ భద్రత కల్పించాలి. అనేక రాష్ట్రాలలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో సిపిఎస్ రద్దు గురించి 2014-19 మధ్య తెలుగుదేశం, 2019-2024 మధ్య వైఎస్ఆర్ ప్రభుత్వం మాట తప్పాయి. ఇప్పుడు ఎన్నికల మ్యానిఫెస్టోలలో సిపిఎస్ గురించి చర్చిస్తామని చెప్పారు తప్పితే రద్దు చేస్తామని మూడు పార్టీలూ పేర్కొనలేదు. ఇక తెలంగాణలో ఇదే పరిస్తితి నెలకొంది. పరస్పర విమర్శలు చేసుకోవడంతోనే కాలం గడిపేస్తున్నారు. ఈ క్రమంలోప్రజలే దీనిని గుర్తించి ఓటేయాలి. చైతన్యం ప్రదర్శించాలి.



# రవితేజ హీరోయిన్‌తో రామ్ డేటింగా..



మాస్ మహరాజా రవితేజ హీరోయిన్ భాగ్య శ్రీ భోర్సే గురించి తెలుగు ప్రేక్షకులకి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రవితేజ నటించిన మిస్టర్ బచ్చన్ అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులని పలకరించింది ఈ చిన్నది. మరాఠి బ్యూటీ భాగ్యశ్రీ భోర్సే కి తొలి సినిమా భారీ డిజాస్టర్ అయినా అమ్మడు మాత్రం ఓవర్‌నైట్ స్టార్ అయింది. దాంతో ఒక్కసారిగా అవకాశాలు వెల్లువలా వస్తున్నాయి. ప్రస్తుతం విజయ్ దేవరకొండ నటిస్తున్నకింగ్ డమ్ , దుల్కర్ సల్మాన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న కాంత వంటి చిత్రాల్లోనూ నటిస్తున్నారు. దీంతో పాటు మరో రెండు చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి.ఒకవైపు తన గ్లామర్ తో , మరోవైపు డేటింగ్ రూమర్స్ తో భాగ్యశ్రీ ఎప్పటికప్పుడు హాట్ టాపిక్ అవుతూ ఉంటుంది. గత కొద్ది రోజులుగా భాగ్య శ్రీ బోర్సే, రామ్ డేటింగ్‌లో ఉన్నారంటూ అనేక ప్రచారాలు జరుగుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. వీరిద్దరూ రాపో 22 సినిమాలో నటిస్తున్నారు. షూటింగ్ సమయంలో వీరి మధ్య ప్రేమ చిగురించిందని అనేక ప్రచారాలు జరుగుతున్నా దానిపై క్లారిటీ లేదు. తాజాగా రామ్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా రాపో 22 సినిమాలో భాగ్య శ్రీ ఫోటోని షేర్ చేస్తూ.. హ్యాపీ బర్త్ డే ! ఈ ఏడాది నీకు ప్రేమ, విజయాలు, సంతోషం దక్కుతాయని ఆశిస్తున్నా. అందుకు నువ్వు అర్హురాలివి. అని రామ్ పోస్ట్ చేశారు .

# న్యూ బిగినింగ్స్ అంటూ అతడి ఫొటో షేర్ చేసిన సమంత

టాలీవుడ్ స్టార్ హీరో సమంత కొన్ని సంవత్సరాల క్రితం నాగ చైతన్య నుండి విడిపోయిన సంగతి తెలిసిందే. ఎంతో అన్యోన్యంగా ఉన్న ఈ జంట ఎవరు ఊహించని విధంగా విడిపోయారు. విడాకుల తర్వాత నాగ చైతన్య రెండో పెళ్లి చేసుకున్నా సమంత మాత్రం సింగిల్‌గా ఉంటుంది. ఆ మధ్య మయోసైటిస్ బారిన పడ్డ సమంత సినిమాలకి కూడా బ్రేక్ ఇచ్చింది. ఇక ఇప్పుడు తిరిగి సినిమాలు చేస్తుంది. సమంత నిర్మాతగా కూడా యాక్టివ్ అవుతోంది. సమంత తన సొంత బ్యానర్ ట్రాలాల మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ లో శుభం చిత్రం నిర్మించగా, ఈ చిత్రం మే 9న రిలీజ్ కి రెడీ అవుతోంది. గత కొద్ది రోజులుగా ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలలో యాక్టివ్‌గా ఉంటూ ఆసక్తికర విషయాలు పంచుకుంటుంది. రీసెంట్‌గా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లోను సమంత పాల్గొంది. అయితే తాజాగా సమంత తన ఇన్‌స్టాలో కొన్ని ఆసక్తికర ఫొటోలు పంచుకుంది. దానికి కామెంట్‌గా చాలా పెద్దదారే దాటి కానీ ఈసారి బలంగా తయారయ్యాను.. ఇక కొత్త ప్రయాణం మొదలైంది.. అంటూ చివరిగా శుభం సినిమా రిలీజ్ డేట్ పెట్టి ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ షేర్ చేసింది . అయితే సమంత షేర్ చేసిన ఒక ఫొటోలో ఆమె దర్శకుడు రాజ్ తో కనిపించింది.. గత కొద్దిరోజులుగా వీరిద్దరూ త్వరలో పెళ్లి చేసుకుంటారు అన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో సమంత అతనితో ఉన్న ఫొటోలు షేర్ చేయడం అందరిలో అనేక అనుమానాలు కలిగిస్తుంది. కొంతకాలంగా సమంత.. రాజ్ నిడిమోరుతో డేటింగ్ లో ఉన్నట్లు తెగ ప్రచారం నడుస్తుంది. కొన్ని సందర్భాల్లో వీరిద్దరూ జంటగా కూడా కనిపించారు. రాజ్ నిడిమోరు ఫ్యామిలీ మ్యాన్ సిరీస్ దర్శకుల్లో రాజ్ ఒకరు. ఫ్యామిలీ మ్యాన్ 2లో సమంత విలన్ గా నటించింది. అదే విధంగా రాజ్ తెరకెక్కించిన హనీ బనీ వెబ్ సిరీస్ లో కూడా నటించింది. ఆ సమయంలో వీరి మధ్య పరిచయం మొదలై అది ప్రేమగా మారిందని అంటున్నారు. మరి వీరి రిలేషన్ ఏంటనే దానిపై ఇప్పటి వరకు క్లారిటీ లేదు.

# మెట్ గాలాలో షారుఖ్ మెరుపులు..

## స్పెషల్ ట్రిబ్యూట్ ఇచ్చిన అమూల్



బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్ ఇటీవల మెట్ గాలా వేడుకలో సందడి చేసిన విషయం తెలిసిందే. ఈ వేడుకకు హాజరైన తొలి భారతీయుడిగా షారుఖ్ రికార్డు సృష్టించాడు. అయితే షారుఖ్ మెట్ గాలాలో చేసిన సందడిపై ప్రముఖ డెయిరీ బ్రాండ్ అమూల్ తనదైన శైలిలో స్పెషల్ ట్రిబ్యూట్ ఇచ్చింది. షారుఖ్‌ను ఇండియాస్ బిగ్గెస్ట్ గాలాకార్ అంటూ ప్రశంసిస్తూ ఒక ప్రత్యేక కార్టూన్‌ను రూపొందించింది. అమూల్ రూపొందించిన ఈ కార్టూన్‌లో షారుఖ్ ఖాన్ మెట్ గాలా వేదికపై ఆకర్షణీయంగా నిలబడి ఉండగా, అమూల్ గర్ల్ ఆయనకు వెన్నతో తయారు చేసిన టోపీని అందిస్తున్నట్లుగా చిత్రీకరించారు. ఈ కార్టూన్‌ను అమూల్ తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకుంది. ప్రస్తుత ట్రెండ్‌లో ఉన్న విషయాలతో పాటు ప్రముఖ వ్యక్తులపై అమూల్ ఎప్పటికప్పుడు తమదైన చమత్కారంతో కూడిన కార్టూన్‌లను రూపొందిస్తుంటుం ది. ఈసారి మెట్ గాలాలో షారుఖ్ ఖాన్ ప్రత్యేకంగా నిలవడంతో, అమూల్ ఆయనను తమ క్రియేటివ్ ప్రమోషన్‌లో భాగం చేసింది. షారుఖ్ ఖాన్ అభిమానులు ఈ కార్టూన్‌ను విశేషంగా ఆదరిస్తున్నారు. తమ అభిమాన నటుడిని అమూల్ గౌరవించిన తీరు వారికి ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. ఈ కార్టూన్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, మెట్ గాలా అనేది ప్రతి సంవత్సరం న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్‌లో జరిగే ఒక ప్రతిష్టాత్మక ఫ్యాషన్ వేడుక. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖులు, ఫ్యాషన్ డిజైనర్లు ఈ వేడుకకు హాజరవుతారు. ఈ ఏడాది జరిగిన మెట్ గాలాలో షారుఖ్ ఖాన్ తన ప్రత్యేక శైలితో అందరి దృష్టిని ఆకర్షించారు.



# బుచ్చిబాబు నెక్స్ట్ సినిమా కూడా ఫిక్స్ అయిందా..

సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు తన తొలి సినిమాగా ఉప్పెన అనే చిత్రం చేశాడు. ఈ చిత్రం ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ ఉప్పెన చిత్రంతో బుచ్చిబాబు టాలెంట్ ఏంటో అందరికి అర్ధమైంది. చెర్రీ కూడా బుచ్చిబాబు పనితీరుకి ఫిదా అయి ఆయనతో కలిసి ఇప్పుడు పెద్ది అనే చిత్రం చేస్తున్నాడు. ఇటీవల ఈ మూవీ గ్లింప్స్ విడుదల కాగా, ఇది చూసి అంతా అవాక్కయ్యారు. గ్లింప్స్‌తోనే అందరి దృష్టినీ తన వైపు తిప్పుకొన్నాడు. పెద్ది సినిమాతో బుచ్చిబాబు పెద్ద బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకోవడం ఖాయం అంటున్నారు. ఇక బుచ్చి. 'పెద్ది' తరవాత బుచ్చి ఏం చేయబోతున్నాడు? అనే చర్చ కూడా నడుస్తుంది. ఈ క్రమంలో 'పెద్ది' అయ్యాక మహేష్ బాబుతో బుచ్చిబాబు ఓ సినిమా చేసే అవకాశాలు ఉన్నాయని ఫిలిం నగర్‌లో జోరుగా చర్చ నడుస్తుంది. గతంలో బుచ్చిబాబు.. మహేష్ నటించిన వన్ సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాడు. ఆ సమయంలో మహేష్ బాబుతో మంచి సాన్నిహిత్యం ఏర్పడిందట. ఈ క్రమంలో ఉప్పెన తర్వాత ఓ సారి మహేష్ బాబుని కలిసాడట. అప్పుడు మహేష్ బాబు.. 'మంచి కథ ఉంటే చెప్పు, చేద్దాం' అని మాట ఇచ్చాడట. దాంతో మహేష్ కోసం మంచి కథ సిద్ధం చేసే పనిలో బుచ్చి ఉన్నట్టు తెలుస్తుంది. మహేష్ కోసం బుచ్చిబాబు యాక్షన్ డ్రామా సిద్ధం చేసుకుంటున్నాడని, ఇందులో మహేష్‌ని నెక్స్ట్ లెవల్‌లో చూపించే ప్రయత్నాల్లో బుచ్చిబాబు ఉన్నాడని ఫిల్మ్‌నగర్ టాక్.ఇక బుచ్చిబాబు ప్రస్తుతం చేస్తున్న పెద్ది చిత్రం రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా రాసుకున్న ఫిక్షనల్ స్టోరీ అని అంటున్నారు. కోవిడ్ టైమ్‌లోనే ఈ కథ రెడీ చేసుకున్నానని చెప్పిన బుచ్చిబాబు సుకుమార్ వల్లే రామ్ చరణ్‌కు కథ వినిపించే ఛాన్స్ వచ్చిందని అన్నారు. ఇక టీజర్‌లో సూపర్ సక్సెస్ అయిన క్రికెట్ షాట్ ..ఫైట్ మాస్టర్ నవకాంత్ డిజైన్ చేశారని, క్రెడిట్ అంతా అతనికే దక్కాలన్నారు. రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. నిజానికి 'పెద్ది' ఐడియా ముందుగా ఎన్టీఆర్‌కే చెప్పాడు...

Editer : Gunnala Anil Reddy,Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131,8096660656